# ప్రజాస్వరం
PRAJASWARAM
తెలుగు దినపత్రిక

MHR TV
www.MHRtv.com

మెదక్ | సంపుటి: 18 సంచిక: 335 | శనివారం, 02 ఆగస్టు 2025 | పేజీలు: 07 వెల: రూ.1

Circulated By: Hyderabad-Medak-Sangareddy-Nalgonda-Warangal-Nizamada-Vijayawada-Guntur-Vizag Adilabad Kurnool | www.prajaswaramdaily.com


## ఓనమాలు రానోళ్లు
# జర్నలిస్టులు అవుతుండ్రు..




### ప్రజల మేలు కోసం ముందుకు
### జర్నలిజానికి ఓ లక్ష్మణ్ రేఖ గీయాలి
### దేశ భద్రతకే ప్రమాదకరం
### సీఎం రేవంత్ సంచలన వ్యాఖ్యలు

**హైదరాబాద్ ఆగస్టు 01(ప్రజాస్వరం):**

కాంగ్రెస్, కమ్యూనిస్టుల సహకారం కంటిన్యూ అవుతుందని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఆయన నవ తెలంగాణ దినపత్రిక పదవ వార్షికోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ...కాంగ్రెస్ పవర్ లోకి రావడానికి కమ్యూనిస్టుల పాత్ర ఎంతో ఉన్నదన్నారు. గతమైనా..ప్రస్తుతమైనా..కమ్యూనిస్టుల సహకారం మరువలేనిదన్నారు. భవిష్యత్ లోనూ కాంగ్రెస్, కమ్యూనిస్టులు కలిసి పనిచేస్తేనే ప్రజలకు మరింత ప్రయోజనం ఉంటుందన్నారు. కాంగ్రెస్, కమ్యూనిస్టుల మధ్య పరస్పర మద్దతు, సంబంధాలు ఎప్పటికీ ఉండాల్సిన అవసరం ఉన్నదని ఆయన కోరుకున్నారు. ఇక నిరంతరం ప్రజల పక్షాన నిలబడి పనిచేసే పత్రికా సంస్థలు కొన్ని మాత్రమే

...మిగతా 2లో

## పేరుకుపోతున్న ఘన, బయో, నిర్మాణ, ఈ–వేస్ట్



2

రోజుకు 60.3 కోట్ల లీటర్ల కలుషిత జలాల విడుదల

11,522 టన్నుల ఘన, 1,300 టన్నుల ప్లాస్టిక్ వ్యర్థాలు సైతం..

ఏటా 74,339 టన్నుల ఈ– వేస్ట్ పారబోత

కాలుష్య నియంత్రణ మండలి గణాంకాల వెల్లడి

## పోలీస్ కస్టడీలోకి నమ్రత

డాక్టర్ నమ్రతపై గోపాలపురం పోలీసులు ఐదు గంటల కస్టడీ విచారణ

చైల్డ్ ట్రాఫికింగ్ ఆరోపణలపై మౌనం, తప్పు చేయలేదని వాదన

ఏజెంట్లు, ఆశా వర్కర్ల డబ్బు లావాదేవీలపై ప్రత్యేక దృష్టి

విజయవాడ, వైజాగ్ బ్రాంచుల నుండి డాక్యుమెంట్స్ సేకరణ ప్రారంభం



3

## ప్రజలతో మమేకమే లక్ష్యం

ప్రజలతో మమేకం కావడమే పాదయాత్ర లక్ష్యం

గాంధీ నుంచి రాహుల్ గాంధీ వరకు.. పాదయాత్రల ప్రేరణ

సీఎం రేవంత్ రెడ్డి తదుపరి పాదయాత్రలో పాల్గొననున్న విషయంపై వెల్లడి

వెన్నుపోటు అయినా సంక్షేమ పథకాల అమలులో రాజీ లేదు : టీపీసీసీ చీఫ్



3

# గ్యారెంటీలు గాలికి..
# 133 కోట్లు ప్రచారానికి

### పత్రికల్లో ప్రకటనలకు కాంగ్రెస్ ప్రభుత్వం భారీగా ఖర్చు
### ఎలక్ట్రానిక్ మీడియా, హోర్డింగుల ఖర్చు అదనం
### ఆర్టీఐ దరఖాస్తుకు సమాధానం చెప్పిన ప్రభుత్వం
### ప్రజాధనం వృథాపై సర్కారుపై సర్వత్రా విమర్శల వెల్లువ



2

## ఉపాధి పనులు కుది'రాయి'!

- అన్నం పెడుతున్న గ్రానైట్ రాయి
- మహబూబాబాద్ జిల్లాలో 50 గ్రానైట్ క్వారీలు
- జిల్లావ్యాప్తంగా వేలాది మందికి ఉపాధి
- దేశ, విదేశాలకు గ్రానైట్ రాళ్ల ఎగుమతులు



2

## ఇది ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కాదు..
## పొక్కలు కొట్టేందుకు..!

కేంద్ర ప్రభుత్వంలో ఉన్నామనే ధైర్యంతో లోకేశ్ మాట్లాడుతున్నారన్న హరీశ్ రావు

కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు స్పందించడం లేదని నిలదీత

లోపాయికారి ఒప్పందం చేసుకున్నారని ఆరోపణ



2

## తెలుగులో ఉత్తమచిత్రంగా
## 'భగవంత్ కేసరి'

- జాతీయ అవార్డులు ప్రకటించిన కేంద్రం
- జాతీయ ఉత్తమ చిత్రంగా '12th ఫెయిల్'
- ఉత్తమ నటుడిగా షారుఖ్ ఖాన్, విక్రాంత్ మాసే
- ఉత్తమ నటిగా రాణి ముఖర్జీ



2

## ఉపరాష్ట్రపతి ఎన్నిక షెడ్యూల్

- ఆగస్టు 21 నామినేషన్‌కు చివరి తేదీ
- సెప్టెంబర్ 9న నిర్వహించనున్న ఈసీ
- ఫలితాలు కూడా పోలింగ్ రోజునే
- స్పష్టమైన ఆధిక్యంలో ఉన్న ఎన్డీయే

3

# గొర్రెల స్కాంలో వెయ్యికోట్లాంట

### గొర్రెల పంపిణీ పథకంలో వేల కోట్ల అవకతవకలు.. ఈడీ సోదాలు
### మాజీ మంత్రుల అనుబంధితుల నివాసాల్లోనూ తనిఖీలు.. కీలక ఆధారాలు స్వాధీనం
### నకిలీ ఖాతాలు.. సంబంధాలపై విచారణ
### కేవలం 7 జిల్లాల్లోనే రూ.253 కోట్లు.. మొత్తం నష్టం రూ.1000 కోట్లకు పైగా



**హైదరాబాద్ ఆగస్టు 01(ప్రజాస్వరం):**

బీఆర్ఎస్ ప్రభుత్వం గొప్పగా చెప్పుకొన్న గొర్రెల పంపిణీ పథకానికి సంబంధించిన అక్రమాలపై ఎన్ ఫోర్స్ మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులు జరుపుతున్న విచారణలో దిగ్భ్రాంతికర వివరాలు వెలుగు చూస్తున్నాయి. రాష్ట్రంలోని 33 జిల్లాల్లో అమలు చేసిన ఈ స్కీంలో వెయ్యి కోట్ల వరకు స్కాం జరిగినట్టుగా ఈడీ అధికారులు నిర్ధారణకు వచ్చారు. మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ వద్ద ఓఎస్డీగా పని చేసి ఈ కేసులో కీలక నిందితునిగా ఉన్న కళ్యాణ్ ఇంటి నుంచి 200 బ్యాంక్ పాస్ బుక్కులు స్వాధీనం చేసుకున్నారు. దాంతోపాటు 31 సెల్ ఫోన్లు,

...మిగతా 2లో

# గ్యారెంటీలు గాలికి.. 133 కోట్లు ప్రచారానికి

- పత్రికల్లో ప్రకటనలకు కాంగ్రెస్ ప్రభుత్వం భారీగా ఖర్చు
- ఎలక్ట్రానిక్ మీడియా, హోర్డింగుల ఖర్చు అదనం
- ఆర్టీఐ దరఖాస్తుకు సమాధానం చెప్పిన ప్రభుత్వం
- ప్రజాధనం వృథాపై సర్కారుపై సర్వత్రా విమర్శల వెల్లువ



**హైదరాబాద్ ఆగస్టు 01(ప్రజాస్వరం):**

నిధులు లేవనే సాకుతో ఎన్నికల హామీలను గాలికొదిలేసిన కాంగ్రెస్ సర్కారు.. సొంత డబ్బా కొట్టుకునేందుకు మాత్రం కోట్లకు కోట్లు ఖర్చు చేస్తున్నదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అధికారంలోకి వచ్చిన తర్వాత ఏడాదిలో ప్రభుత్వం ప్రచారానికి భారీగా ఖర్చు చేయడమే ఇందుకు నిదర్శనమని పలువురు మండిపడుతున్నారు. కేవలం పత్రికల్లో ప్రకటనల కోసమే రూ.133 కోట్లు ఖర్చు చేసినట్టు ప్రభుత్వమే వెల్లడించింది.

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన 2023 డిసెంబర్ 7 నుంచి ఈ ఏడాది జనవరి 31వరకు ప్రచార ప్రకటనల కోసం ప్రభుత్వం ఎంత ఖర్చు చేసిందో వెల్లడించాలని రాజేంద్ర పల్నాటి అనే వ్యక్తి ఆర్టీఐ కింద దరఖాస్తు చేశారు. రూ.133,03,25,741 ఖర్చు చేసినట్టు ప్రభుత్వం వెల్లడించింది. ఇందులో చిన్న పత్రికలు, మ్యాగజైన్లకు అంబేద్కర్ జయంతిని పురస్కరించుకొని రూ. 2,86,09, 246, మరోసారి రూ. 68,51, 100 ప్రకటనలు ఇచ్చినట్టు పేర్కొంది. వివిధ ప్రభుత్వ పథకాల ప్రచారం కోసం చిన్న పత్రికలకు రూ.17,60,01,794 కోట్లు వెచ్చించినట్టు స్పష్టంచేసింది. ఇది ప్రింట్ మీడియాలో ప్రచారం కోసం చేసిన ఖర్చు మాత్రమే. ఎలక్ట్రానిక్ మీడియాతోపాటు హోర్డింగ్‌లు, బస్ షెల్టర్లు, మెట్రో పిల్లర్లు తదితర ప్రచార ప్రకటనల కోసం చేసిన ఖర్చు ఇందుకు అదనం.

**పథకాల అమలు సున్నా.. ప్రచారం మిన్న!**

అధికారంలోకి వస్తే 100 రోజుల్లో ఆరు గ్యారెంటీలు అమలు చేస్తామని కాం గ్రెస్ హామీ ఇచ్చింది. కానీ కాంగ్రెస్ గెలిచి 600రోజులు గడిచినా గ్యారంటీలు అ మలుకు నోచుకోలేదు. తెలంగాణ ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలం, ఇందిరమ్మ ఇండ్లు, వృద్ధాప్య పింఛన్ నెలకు రూ.4000కు పెంపు ఇలా చాలా హామీల అమలు ఊసేలేదు. రాష్ట్రం దివాలా తీసిందని ఓవైపు చెప్తున్న సీఎం రేవంత్..మరీ ప్రకటనలకు ఇంత ఖర్చు ఏలా చేశారని విమర్శలు వస్తున్నాయి.

# పేరుకుపోతున్న ఘన, బయో, నిర్మాణ, ఈ–వేస్ట్

- రోజుకు 60.3 కోట్ల లీటర్ల కలుషిత జలాల విడుదల
- 11,522 టన్నుల ఘన, 1,300 టన్నుల ప్లాస్టిక్ వ్యర్థాలు సైతం..
- ఏటా 74,339 టన్నుల ఈ– వేస్ట్ పారబోత
- కాలుష్య నియంత్రణ మండలి గణాంకాల వెల్లడి

**హైదరాబాద్ ఆగస్టు 01(ప్రజాస్వరం):**

తెలంగాణ రాష్ట్రంలో ఎక్కడ చూసినా వ్యర్థాలు కుప్పలుతెప్పలుగా పేరుకుపోతున్నాయి. ఎలక్ట్రానిక్ వేస్ట్‌తోపాటు ఘన, బయో, నిర్మాణ, ప్లాస్టిక్ వ్యర్థాలు విపరీతంగా పోగవుతున్నాయి. జీవరాశులకు ప్రాణాధారమైన గాలి, నీరు, భూమిని కలుషితం చేస్తున్నాయి. మానవాళితోపాటు సకల జీవరాశుల ఆరోగ్యంపై ప్రభావం చూపుతున్నాయి. రాష్ట్రంలో ఏటేటా పరిశ్రమల నుంచి వ్యర్థాల విడుదల గణనీయంగా ఉందనే విషయాన్ని కాలుష్య నియంత్రణ మండలి (పీసీబీ) గణాంకాలు వెల్లడిస్తున్నాయి.

అయితే వ్యర్థాల నియంత్రణ, నిర్వహణ, శుద్ధి చేయాల్సిన పీసీబీకి ప్రభుత్వం ఒక్క రూపాయి నిధులను కూడా కేటాయించకపోవడం గమనార్హం. 2014-15 సంవత్సరం నుంచి ప్రభుత్వం పీసీబీకి నిధులు, గ్రాంట్లను కేటాయించడం లేదు. కేవలం ఆపరేషన్, రెన్యూవల్ కన్సెంట్ రూపంలో ఆసుపత్రులు, పరిశ్రమలు చెల్లించే ఫీజులే పీసీబీకి ఆదాయం వనరులుగా మారాయి.

**పరిశ్రమల నుంచి కలుషిత జలాలు..**

రాష్ట్రంలో పరిశ్రమలను రెడ్, ఆరెంజ్, గ్రీన్, వైట్ అనే నాలుగు కేటగిరీలుగా విభజించారు. ఇందులో రెడ్ కేటగిరీ అత్యంత హానికారక పరిశ్రమల కిందికి వస్తుంది. రాష్ట్రంలో 3,838 రెడ్ కేటగిరీ పరిశ్రమలు ఉన్నాయి. 4,330 ఆరెంజ్, 1,332 గ్రీన్, 2,692 వైట్ కేటగిరీ పరిశ్రమలు ఉన్నాయి. 2,193 పరిశ్రమలు రోజుకు 60.3 కోట్ల లీటర్ల కలుషిత జలాలను విడుదల చేస్తున్నాయి. ఈ వ్యర్థాలు నీరు చెరువులు, కాలువలు, పంట పొలాలు, భూగర్భంలోకి ఇంకుతున్నాయి.

3,024 పరిశ్రమలు ఏటా 3.17 లక్షల టన్నుల ప్రమాదక వ్యర్థాలను విడుదల చేస్తున్నాయి. ఇందులో 94,131 టన్నులు పునర్వినియోగించదగిన వ్యర్థాలు కాగా.. 2,085 టన్నులు దహనం చేయగల వ్యర్థాలు, 1,10,930 టన్నులు కో-ప్రాసెసింగ్, 1,09,943 టన్నులు భూమిలో నింపే వ్యర్థాలు.

**ఘన వ్యర్థాలూ ఘనమే..**

రోజుకు 11,522 టన్నుల ఘన వ్యర్థాలు (Solid Waste) విడుదలవుతున్నాయి. ఇందులో జీహెచ్ఎంసీ పరిధిలో 7,206 టన్నులు కాగా.. 4,316 టన్నులు మున్సిపాలిటీ, పంచాయతీల నుంచి విడుదల అవుతున్నాయి. రాష్ట్రంలో ఆరోగ్య



సంరక్షణ కేంద్రాల నుంచి శుద్ధి చేయని బయో మెడికల్ వ్యర్థాలు విడుదల కావడం లేదు. ఇతర వ్యర్థాల మిశ్రమంతో బయో వేస్ట్ విడుదల అవుతున్నాయి. 10,292 ఆరోగ్య సంరక్షణ కేంద్రాల నుంచి రోజుకు 26,316 కిలోల బయో మెడికల్ వేస్ట్ విడుదల అవుతోంది. ఇందులో 17,184 కిలోలు దహించలేని బయో మెడికల్ వేస్ట్ కాగా.. 9,132 కిలోలు ఆటో క్లేవ్ వ్యర్థాలు.

**ఈ–వేస్ట్..**

కంప్యూటర్లు, ల్యాప్‌టాప్‌లు వంటి ఎలక్ట్రానిక్ ఉత్పత్తుల వ్యర్థాలు కూడా గణనీయంగా పేరుకుపోతున్నాయి. రాష్ట్రంలో ఏటా 74,339 టన్నుల ఈ-వేస్ట్ విడుదలవుతోంది. 31 ఈ-వేస్ట్ (e waste) కేంద్రాల్లో ఏటా 1,83,668 టన్నుల ఈ-వేస్ట్ శుద్ధి అవుతోంది. రాష్ట్రంలో రోజుకు 2,255 టన్నుల నిర్మాణ వ్యర్థాలు విడుదల అవుతున్నాయి. ఇందులో జీహెచ్ఎంసీ పరిధిలో 1,763 టన్నులు, మున్సిపాలిటీ, పంచాయతీల్లో 492 టన్నుల వ్యర్థాలు ఉన్నాయి.

జీడిమెట్ల, ఫతుల్‌గూడ, శామీర్‌పేట, శంషాబాద్‌లో వ్యర్థాల శుద్ధి కేంద్రాలు ఉన్నాయి. ఏటా వీటి సామర్థ్యం 2 వేల టన్నులు. రాష్ట్రంలో 251 ప్లాస్టిక్ తయారీ కేంద్రాలు నమోదయ్యాయి. వీటి నుంచి రోజుకు 1,300 టన్నుల ప్లాస్టిక్ వ్యర్థాల విడుదల అవుతుండగా.. 900 టన్నులు మాత్రమే ప్రాసెస్ అవుతోంది.

# ఇది ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కాదు.. పొక్కలు కొట్టేందుకు..!

- కేంద్ర ప్రభుత్వంలో ఉన్నామనే ధైర్యంతో లోకేశ్ మాట్లాడుతున్నారన్న హరీశ్ రావు
- కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు స్పందించడం లేదని నిలదీత
- లోపాయికారి ఒప్పందం చేసుకున్నారని ఆరోపణ



**హైదరాబాద్ ఆగస్టు 01(ప్రజాస్వరం):**

దేశంలోని కీలక అంశాలపై కాంగ్రెస్ న్యాయ సదస్సుఆంధ్రప్రదేశ్ విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌పై తెలంగాణ మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు నిప్పులు చెరిగారు. ఇది ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కాదు.. పొక్కలు కొట్టేందుకు అని నారా లోకేశ్‌కు హరీశ్‌రావు స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారు. బనకచర్ల ప్రాజెక్టుపై తెలంగాణ భవన్‌లో హరీశ్‌రావు మీడియాతో మాట్లాడారు.

నారా లోకేశ్ మాట్లాడుతూ.. మిగులు జలాలు సముద్రంలో కలుస్తున్నాయి.. కనబడుతలేదా అంటున్నాడు. సాగునీటి జలాల్లో నారా లోకేశ్‌కు అవగాహనం లోపం ఉంది. ఆయన యంగ్‌స్టర్.. భవిష్యత్‌ను చెడగొట్టుకుంటున్నారు. అవగాహన లేకుండా మాట్లాడి ప్రజల ముందు అభాసుపాలు అవుతున్నారు. అధికారం ఉంది కదా.. మందబలం ఉంది.. సీఎం రేవంత్, కేంద్రం మా చేతుల్లో ఉన్నారని ఏది మాట్లాడితే అది మాట్లాడితే చెల్లుతది అనుకుంటే అది పొరపాటు కదా..? మిగులు జలాలు సముంద్రంలో కలుస్తున్నాయి అంటున్నారు కదా.. ఒక వేళ నీళ్లు ఉన్నదే నిజమైతే కేంద్ర ప్రభుత్వ సంస్థలు సెంట్రల్ వాటర్ కమిషన్ మీ డీపీఆర్‌ను ఎందుకు తిప్పి పంపింది. గోదావరి రివర్ మేనేజమెంట్ బోర్డు ఎందుకు తిప్పి పంపింది. కేంద్ర ప్రభుత్వ పర్యావరణ మంత్రిత్వ శాఖ కూడా తిరస్కరించింది. నీళ్లు ఉన్నది నిజమైతే నాలుగు కేంద్ర సంస్థలు బనచర్లకు ఎందుకు తిరస్కరించాయో లోకేశ్ సమాధానం చెప్పాలి. గోదావరిలో తెలంగాణ వాటా ఎంత..? ఏపీ వాటా ఎంతో సమాధానం చెప్పాలని నారా లోకేశ్‌ను హరీశ్‌రావు డిమాండ్ చేశారు.

కాళేశ్వరం ప్రాజెక్టుకు పొక్క కొట్టి తీసుకుపోతున్నామా..? పొక్క కొట్టేందుకు ఇది ఏమైనా శ్రీశైలం ప్రాజెక్టా..? పోతిరెడ్డిపాడు ప్రాజెక్టా..? ఇది ఏమైనా ఉమ్మడి ఆంధ్రప్రదేశా..? కాళేశ్వరం ఒక లిఫ్ట్ ఇరిగేష్ ప్రాజెక్టు.. దీనికి పొక్క కొట్టుడు, చిల్లు కొట్టుడు ఉండదు. ఆనాడు ఉమ్మడి ఏపీలో ఈనాటి కాంగ్రెస్ నేతలు పదవుల కోసం పెదవులు మూసుకోవడం వల్ల మీరు ఆడిందే ఆట పాడిందే పాట.. పోతిరెడ్డిపాడుకు పొక్క కొట్టి నీళ్లు తీసుకుపోయారు.. ఈనాటి కాంగ్రెస్ నాయకుల మౌనం వల్ల తెలంగాణకు తీవ్ర అన్యాయం జరిగింది. కానీ ఇక్కడున్నది బీఆర్ఎస్ పార్టీ. తెలంగాణ రాష్ట్రంగా ఉంది. ఇష్టమొచ్చినట్టు పొక్క కొడుతాం అంటే చూసుకుంటూ ఊరుకోం అని నారా లోకేశ్‌ను హరీశ్‌రావు హెచ్చరించారు.

నారా లోకేశ్ అన్ని అబద్ధాలు మాట్లాడుతున్నాడు. కాళేశ్వరం ప్రాజెక్టుకు అనుమతి లేదని మాట్లాడుతున్నాడు. ఒకటి కాదు రెండు కాదు 11 అనుమతులు ఉన్నాయి. అన్ని రకాల అనుమతులు సాధించి కాళేశ్వరం ప్రాజెక్టును నిర్మించింది బీఆర్ఎస్ ప్రభుత్వం. మీకు అనుమానం ఉంటే ఈ అనుమతుల లేఖలు పంపిస్తాను వెరిఫై చేసుకోండి అని హరీశ్‌రావు సూచించారు.

నిన్న లోకేశ్ మాట్లాడుతూ కాళేశ్వరం ప్రాజెక్టును ఎప్పుడైనా అడ్డుకున్నామా..? టీడీపీ అడ్డుకోలేదు. తెలుగు ప్రజలంతా ఒక్కటే అని సన్నాయి నొక్కులు నొక్కతున్నాడు. మీకు తెల్వకపోతే మీ నాన్నను అడగండి.. కాళేశ్వరం ప్రాజెక్టును అడ్డుకున్నామా..? లేకపోతే ఎన్నిసార్లు అడ్డుకున్నాం అని మీ నాన్నను అడగండి. అన్ని అనుమతులు వచ్చిన తర్వాత 2018లో రద్దు చేయండి, పనులు నిలిపివేయండి అని కేంద్రానికి సీఎం చంద్రబాబు లేఖ రాశారు. కాళేశ్వరం ప్రాజెక్టును వ్యతిరేకిస్తూ బాబు ఏడు లేఖలు రాశారు. నిన్ననేమో మేం కాళేశ్వరం వ్యతిరేకించామా..? అని లోకేశ్ సన్నాయి నొక్కులు నొక్కుతున్నాడని హరీశ్‌రావు తీవ్రస్థాయిలో మండిపడ్డారు.

# గొర్రెల స్కాంలో వెయ్యికోట్లాంట

మొదటిపేజీ తరువాయి

20 సిమ్ కార్డులను సీజ్ చేశారు. ఇక, కళ్యాణ్ ఆన్ లైన్ బెట్టింగ్ యాప్ లకు బ్యాంక్ అకౌంట్లను కూడా సమకూర్చినట్టుగా కనుగొన్నారు. కాగా, ఈ కేసులో ఇప్పటికీ పరారీలో ఉన్న ప్రైవేట్ కాంట్రాక్టర్లు మొయినుద్దీన్, అతని కుమారుడు ఇక్రముద్దీన్ లు పట్టుబడితే ఈ కేసులో మరిన్ని సంచలన వివరాలు వెలుగు చూసే అవకాశాలు కనిపిస్తున్నాయి.

**2017లో..**

2017లో బీఆర్ఎస్ ప్రభుత్వం గొర్రెల పంపిణీ పథకాన్ని ప్రారంభించిన విషయం తెలిసిందే. ఇది గొల్లకురుమల జీవితాల్లో కొత్త వెలుగులు తీసుకు వస్తుందని గొప్పగా చెప్పిన అప్పటి ప్రభుత్వం పథకానికి 12వేల కోట్ల రూపాయలను కేటాయించింది. ఇక, ఇరవై గొర్రెలు, ఒక పొట్టేల్ తో కూడిన యూనిట్ ధరను లక్షా 25రూపాయలుగా నిర్ణయించింది. ఈ రేటుకు గొర్రెల యూనిట్లు కొని పంపిణీ చేయాలని నిర్ణయించింది.

**ప్రైవేట్ కాంట్రాక్టర్ ప్రవేశంతో...**

అయితే, బీఆర్ఎస్ ప్రభుత్వంలోని కొంతమంది ముఖ్యనేతలతో సన్నిహిత సంబంధాలు ఉన్న ప్రైవేట్ కాంట్రాక్టర్ మొయినుద్దీన్, అతని కుమారుడుఇక్రముద్దీన్ లు ఎంట్రీ ఇచ్చిన తరువాత స్కీం స్వరూపమే మారిపోయింది. అప్పటివరకు లక్షా 25 వేలుగా ఉన్న ఒక్కో యూనిట్ ధర ప్రభుత్వ ఆమోదం లేకుండానే లక్షా 75వేలకు పెరిగింది. ధర పెంచినా పథకాన్ని సరిగ్గా అమలు చేశారా? అంటే అదీ లేదు. గొర్రెల విక్రయందారుల నుంచి వాటిని కొని చెల్లించాల్సిన డబ్బులు చెల్లించకుండా తమ సొంత ఖాతాల్లోకి మళ్లించుకున్నారు. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పల్నాడు జిల్లాకు చెందిన ఏడుకొండలుతోపాటు మరికొందరు రాయదుర్గం పోలీసులకు ఫిర్యాదులు చేశారు. తమ నుంచి కొందరు ప్రభుత్వ అధికారులు, మొయినుద్దీన్, ఇక్రముద్దీన్ కలిసి గొర్రెలు కొని ఇవ్వాల్సిన 2.1కోట్ల రూపాయలను తమ సొంత ఖాతాల్లోకి మళ్లించుకున్నట్టుగా అందులో పేర్కొన్నారు. దీంతో ఈ పథకంలోని కుంభకోణం తీగ కదిలింది.

**ఏసీబీ విచారణలో...**

గొర్రెల స్కీంలో వందల కోట్ల రూపాయల అక్రమాలు జరిగినట్టుగా ఆరోపణలు రావటంతో ప్రస్తుత ప్రభుత్వం కేసును ఏసీబీకి అప్పగించింది. ఏసీబీ విచారణలో దిమ్మతిరిగే వివరాలు వెలుగు చూశాయి. గొర్రెల పంపిణీ పథకంలో దాదాపు 700 కోట్ల రూపాయల అవినీతి జరిగిందని బయట పడింది. ఈ క్రమంలో పశు సంవర్ధక శాఖ మాజీ డైరెక్టర్ రాంచందర్ నాయక్ తోపాటు ఈ స్కీంలో నోడల్ ఆఫీసర్లుగా వ్యవహరించిన పలువురిని ఏసీబీ అధికారులు అరెస్ట్ చేశారు. అదే సమయంలో బీఆర్ ఎస్ ప్రభుత్వంలో పశు సంవర్ధక శాఖ మంత్రిగా ఉన్న తలసాని శ్రీనివాస్ యాదవ్ వద్ద ఓఎస్డీగా పని చేసిన కళ్యాణ్ ను కూడా అరెస్ట్ చేశారు. ఇక, కాగ్ జరిపిన ఆడిట్ లో కేవలం 7 జిల్లాల్లోనే 253.93కోట్ల రూపాయల మేర అక్రమాలు జరిగినట్టుగా వెల్లడైంది.

**ఈడీ ప్రవేశంతో...**

కాగా, గొర్రెల పంపిణీలో గోల్ మాల్ అయిన నిధుల్లో మనీలాండరింగ్ జరిగినట్టుగా అనుమానించిన ఈడీ అధికారులు కొంతకాలం క్రితం దీనిపై కేసులు నమోదు చేశారు. తాజాగా, ఈ కేసుతో సంబంధం ఉన్న పశు సంవర్ధక శాఖ మాజీ డైరెక్టర్ రాంచందర్ నాయక్, కళ్యాణ్ నివాసాలతోపాటు మొత్తం 8చోట్ల ఏకకాలంలో దాడులు జరిపి విస్తృతస్థాయిలో సోదాలు జరిపారు.

**పంపిణీ చేయకుండానే...**

ఈడీ అధికారుల విచారణలో లబ్దిదారులకు గొర్రెలను పంపిణీ చేయకుండానే చేసినట్టుగా రికార్డులు సృష్టించి కోట్లాది రూపాయలు కొల్లగొట్టినట్టుగా వెల్లడైంది. నిజానికి లబ్దిదారులుగా చూపిన వారిలో చాలామంది అంతకు ముందు ఎప్పుడూ గొర్రెల వ్యాపారం చేయలేదని స్పష్టమైంది. వీళ్లు ఎప్పుడూ గొర్రెలను కొనటంగానీ...అమ్మటంగానీ చేయలేదని నిర్ధారణ అయ్యింది. అవినీతికి పాల్పడ్డ అధికారులు, ప్రైవేట్ కాంట్రాక్టర్లు కొంతమంది బోగస్ లబ్దిదారులుగా పేర్కొని వారి ఖాతాల్లోకి డబ్బు మళ్లించినట్టుగా తేలింది.ఊహాజనిత వ్యాపారుల పేర నిధులను పక్కదారి పట్టించినట్టుగా వెల్లడైంది. ఈ మొత్తం అవినీతి బాగోతంలో పలువురు ప్రభుత్వ అధికారులు, ప్రైవేట్ వ్యక్తుల పాత్ర ఉన్నట్టుగా నిర్ధారణ అయ్యింది. ఈ మేరకు ఈడీ అధికారుల చేతికి పలు కీలక డాక్యుమెంట్లు కూడా చిక్కాయి. ఇక, మాజీ మంత్రి వద్ద ఓఎస్డీగా పని చేసిన కళ్యాణ్ ఇంట్లో జరిపిన తనిఖీల్లో 200 బ్యాంక్ పాస్ బుక్కులు దొరికాయి. దాంతోపాటు 31 మొబైల్ ఫోన్లు, 20 సిమ్ కార్డులు కూడా లభ్యమయ్యాయి. ఇక్కడ గమనించాల్సిన మరో అంశం ఏమిటంటే బెట్టింగ్ యాప్ ల నిర్వాహకులకు కళ్యాణ్ బ్యాంక్ ఖాతాలను సమకూర్చినట్టుగా ఈడీ విచారణలో వెల్లడి కావటం. ఇప్పటి వరకు జరిపిన విచారణలో గొర్రెల పంపిణీ స్కీంలో 1000కోట్ల స్కాం జరిగినట్టుగా వెల్లడైందని ఈడీ అధికారులు శుక్రవారం అధికారికంగా ప్రకటించారు. ఈ కేసులో కీలక నిందితులుగా ఉన్న మొయినుద్దీన్, ఇక్రముద్దీన్ తోపాటు మరికొందరు పట్టుబడితే మరిన్ని వివరాలు వెలుగు చూసే అవకాశాలు ఉన్నాయని తెలిపారు.

# ఓనమాలు రానోళ్లు జర్నలిస్టులు అవుతుండ్రు..



మొదటిపేజీ తరువాయి

ఉన్నాయని వివరించారు. ప్రస్తుతం పత్రికా సంస్థలు తమ విశ్వసనీయతని కోల్పోయే పరిస్థితి తలెత్తుతోందన్నారు. స్వాతంత్ర్య పోరాటంలో దేశ ప్రజలను ఏకతాటిపైకి తీసుకొచ్చేందుకు పత్రికలు ఎంతో ఉపయోగపడ్డాయన్నారు. సాయుధ రైతాంగ పోరాటంలో, సామాజిక రుగ్మతలపై ప్రజలలో చైతన్యం తీసుకొచ్చేందుకు కమ్యూనిస్టుల ఆధ్వర్యంలో నిర్వహించిన పత్రికలు మేలు చేశాయన్నారు. కానీ ప్రస్తుత రోజుల్లో రాజకీయ పార్టీల పత్రికలు వింత పోకడతో వ్యవహరిస్తున్నాయని సీఎం మండిపడ్డారు. తమ సంపాదనను కాపాడుకోవడానికి, తప్పులను కప్పి పుచ్చుకునేందుకు కొన్ని రాజకీయ పత్రికలు పనిచేస్తున్నాయన్నారు. దీంతో జర్నలిస్టు అనే పదానికి అర్థం లేకుండా పోతోందని సీఎం మండిపడ్డారు. జర్నలిజం ముసుగులో ఉన్న కొన్ని రాజకీయ పార్టీల పత్రికల తీరును ప్రజలు నిశితంగా గమనించాల్సిన అవసరం ఉన్నదన్నారు. నిజమైన జర్నలిస్టులు ఒక లక్ష్మణ రేఖ గియాల్సిన పరిస్థితి ఏర్పడిందని సీఎం వ్యాఖ్యానించారు. లేకుంటే దేశ భద్రతకే ప్రమాదం అని వెల్లడించారు.

# తెలుగులో ఉత్తమచిత్రంగా 'భగవంత్ కేసరి'

- జాతీయ అవార్డులు ప్రకటించిన కేంద్రం
- జాతీయ ఉత్తమ చిత్రంగా '12th ఫెయిల్'
- ఉత్తమ నటుడిగా షారుఖ్ ఖాన్, విక్రాంత్ మాసే
- ఉత్తమ నటిగా రాణి ముఖర్జీ

**హైదరాబాద్ ఆగస్టు 01(ప్రజాస్వరం):**

కేంద్ర ప్రభుత్వం 71వ జాతీయ చలనచిత్ర అవార్డులను ప్రకటించింది. '12th ఫెయిల్' సినిమా జాతీయ ఉత్తమ చిత్రంగా ఎంపికైంది. జాతీయ ఉత్తమనటుడు అవార్డును షారుఖ్ ఖాన్ (జవాన్), విక్రాంత్ మాసే (12th ఫెయిల్) పంచుకున్నారు. ఉత్తమ నటిగా రాణి ముఖర్జీ (మిసెస్ ఛటర్జీ వర్సెస్ నార్వే) పురస్కారానికి ఎంపికయ్యారు.

ఇక, నందమూరి బాలకృష్ణఅనిల్ రావిపూడి కాంబోలో వచ్చిన 'భగవంత్ కేసరి' చిత్రం తెలుగులో ఉత్తమ చిత్రంగా నిలిచింది. జాతీయ ఉత్తమ కన్నడ చిత్రంగా 'కండీలు', జాతీయ ఉత్తమ తమిళ చిత్రంగా 'పార్కింగ్' ఎంపికయ్యాయి. జాతీయ ఉత్తమ హిందీ చిత్రం 'కథల్' ఎంపికైంది. ఇక, జాతీయ ఉత్తమ యాక్షన్ డైరెక్షన్ సినిమా కేటగిరీలో 'హనుమాన్' అవార్డుకు ఎంపికైంది.

జాతీయ ఉత్తమ సినీ గీతంగా తెలుగు పాట ఎంపికవడం విశేషం. బలగం సినిమాలోని 'ఉరుపల్లె టూరు' అంటూ సాగే పాటకు జాతీయ పురస్కారం దక్కింది. ఈ పాటకు కాసర్ల శ్యామ్ సాహిత్యం అందించారు. జాతీయ ఉత్తమ సంగీత దర్శకుడిగా ఏఆర్ రెహమాన్ మేనల్లుడు జీవీ ప్రకాశ్ కుమార్ (వాత్తి) అవార్డుకు ఎంపికయ్యారు.

జాతీయ ఉత్తమ స్క్రీన్ ప్లే రైటర్ గా సాయి రాజేశ్ ఎంపికయ్యారు. సూపర్ హిట్టయిన 'బేబీ' చిత్రానికి గాను ఆయన ఈ పురస్కారం అందుకోనున్నారు. అంతేకాదు, 'బేబీ' చిత్రానికి గాను పీవీఎన్ఎస్ రోహిత్ జాతీయ ఉత్తమ నేపథ్య గాయకుడిగా అవార్డుకు ఎంపికయ్యారు.






# ఉపాధి పనులు కుది'రాయి'!

- అన్నం పెడుతున్న గ్రానైట్ రాయి
- మహబూబాబాద్ జిల్లాలో 50 గ్రానైట్ క్వారీలు
- జిల్లావ్యాప్తంగా వేలాది మందికి ఉపాధి
- దేశ, విదేశాలకు గ్రానైట్ రాళ్ల ఎగుమతులు

**హైదరాబాద్ ఆగస్టు 01(ప్రజాస్వరం):**

మహబూబాబాద్ జిల్లాలో భారీగా నిర్వహిస్తున్న గ్రానైట్ క్వారీలతో ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయి. పలు మండలాల్లో గ్రానైట్ క్వారీ పరిశ్రమలు కొనసాగుతున్నాయి. 40 ఏళ్లుగా అంతర్జాతీయంగా పేరుగాంచిన మెడివెస్ట్ గ్రానైట్, గాయత్రి గ్రూప్ ఆఫ్ ఇండస్ట్రీస్.. జిల్లాలోని ఇనుగుర్తి మండలం చిన్ననాగారం, మీర్యతండా, కేసముద్రం మండలం తీగలవేణి, అర్పపల్లి గ్రామాల్లో క్వారీలను నిర్వహిస్తున్నాయి.

జిల్లావ్యాప్తంగా వేలాది ఎకరాల్లో విస్తరించిన 50 గ్రానైట్ క్వారీ పరిశ్రమల్లో.. ఎంతో మందికి ఉపాధి దొరుకుతోంది. మేనేజర్ నుంచి వాచ్‌మన్ వరకు స్థానికులతో పాటు ఇతర రాష్ట్రాలు ఒడిశా, అస్సాం, బిహార్ రాష్ట్రాల నుంచి వేలాది మంది ఉద్యోగులు, కార్మికులకు ఉపాధి దొరుకుతోంది.

> **ఉమ్మడి వరంగల్ జిల్లా గ్రానైట్ నాణ్యమైనది**
>
> పాతికేళ్లుగా గ్రానైట్ ఫీల్డ్‌లోనే సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్నా. ఉమ్మడి వరంగల్ జిల్లాలో లభించే గ్రానైట్ నాణ్యతలో దేశంలోనే ప్రథమస్థానంలో ఉంది. జిల్లాలో తీసే గ్రానైట్ సంపదకు భలే డిమాండ్ ఉంది.
>
> **– రావులపల్లి రవికుమార్, సూపర్‌వైజర్, మెడివెస్ట్ గ్రానైట్, కేసముద్రం**

**జిల్లాలో ఖరీదైన గ్రానైట్**

మహబూబాబాద్ జిల్లా ఇనుగుర్తి మండలంలోని చిన్ననాగారం, కేసముద్రం మండలం అర్పనపల్లి, తీగలవేణి, కేసముద్రం, నెల్లికుదురు మండలం ఎర్రబెల్లిగూడెం గ్రామ పరిధిలో నిర్వహిస్తున్న క్వారీల నుంచి తీస్తున్న బ్లాక్ గ్రానైట్ సిరులు కురిపిస్తోంది. ఇది ఖరీదైన గ్రానైట్‌గా పేరొందింది. ఈ గ్రానైట్‌ను హైదరాబాద్ నుంచి విదేశాలకు తరలిస్తున్నారు.



కాగా రాజ్యసభ సభ్యుడు, గాయత్రి గ్రానైట్ గ్రూప్ ఆఫ్ ఇండస్ట్రీస్ చైర్మన్ వద్దిరాజు రవిచంద్ర కూడా దేశ, విదేశాలకు నల్ల గ్రానైట్‌ను ఎగుమతి చేస్తున్నారు.

**యంత్రాల విడిభాగాలతో ఉపాధి**

భూగర్భం నుంచి గ్రానైట్ ఖనిజ సంపద తీయడానికి ఉపయోగించే యంత్రాల విడిభాగాలను సరఫరా చేస్తూ కూడా ఎంతోమంది ఉపాధి పొందుతున్నారు. గ్రానైట్ బండలను లారీల ద్వారా హైదరాబాద్‌కు తరలిస్తారు. అక్కడ పెద్ద పెద్ద యంత్రాలతో టైల్స్‌గా కట్ చేయడం, పాలిష్ చేసి విదేశాలకు సరఫరా చేయడం వరకు అంతా ఉపాధి లభిస్తుంది. గ్రానైట్ క్వారీల పరిధిలోని గ్రామాలు అభివృద్ధి చెందుతున్నాయి.

**పదేళ్లుగా గ్రానైట్ క్వారీలోనే..**

పదేళ్లుగా ఇనుగుర్తి మండలం మీర్యతండా గ్రానైట్ క్వారీలోనే ఉద్యోగిగా విధులు నిర్వహిస్తున్నా. క్వారీ ద్వారా ఉపాధితోనే కుటుంబాన్ని పోషించుకుంటున్నాను. క్వారీ ద్వారా ఎంతోమంది ఉపాధి అవకాశాలు పొందుతున్నారు. గ్రానైట్ క్వారీలు నిర్వహించడానికి నిర్వాహకులు ఎంతో శ్రమించాలి. - గుండాల శోభన్, చిన్ననాగారం

**సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్నా**

ఒక క్వారీలో సూపర్‌వైజర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాను. క్వారీల్లో ఎంతో మందికి ఉపాధి అవకాశాలు దొరుకుతున్నాయి. స్థానికులే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన వారికి క్వారీలో ఉపాధి కల్పిస్తున్నారు. మా పరిధిలో 30 ఏళ్లుగా గ్రానైట్ క్వారీలను నడుపుతున్నారు. - గుగులోత్ రాజేందర్, ఇనుగుర్తి మండలం మీర్యతండా

# పోలీస్ కస్టడీలోకి నమ్రత

- డాక్టర్ నమ్రతపై గోపాలపురం పోలీసులు ఐదు గంటల కస్టడీ విచారణ
- చైల్డ్ ట్రాఫికింగ్ ఆరోపణలపై మౌనం, తప్పు చేయలేదని వాదన
- ఏజెంట్లు, ఆశా వర్కర్ల డబ్బు లావాదేవీలపై ప్రత్యేక దృష్టి
- విజయవాడ, వైజాగ్ బ్రాంచుల నుండి డాక్యుమెంట్స్ సేకరణ ప్రారంభం

**హైదరాబాద్ ఆగస్టు 01(ప్రజాస్వరం):**

సృష్టి ఫెర్టిలిటీ కేసులో ప్రధాన నిందితురాలిగా ఉన్న డాక్టర్ నమ్రతను పోలీసులు కస్టడీలోకి తీసుకుని విచారిస్తున్నారు. నార్త్ జోన్ డీసీపీ కార్యాలయంలో గోపాలపురం పోలీసులు బుధవారం ఆమెను దాదాపు ఐదు గంటల పాటు విచారించారు. చైల్డ్ ట్రాఫికింగ్ ఆరోపణల నేపథ్యంలో ఈ విచారణ ముమ్మరంగా సాగింది.

చైల్డ్ ట్రాఫికింగ్, సరోగసీ పేరుతో పిల్లల విక్రయాలు అనే తీవ్ర ఆరోపణలపై అడిగిన ప్రశ్నలకు డాక్టర్ నమ్రత తగిన సమాధానాలు ఇవ్వలేదు. చాలాసార్లు ఆమె నోరుమెదపక మౌనంగా ఉన్నట్టు సమాచారం. "తాను ఎలాంటి తప్పూ చేయలేదు" అనే సమాధానాన్ని మాత్రమే మళ్లీ మళ్లీ చెప్పినట్టు పోలీసులు వెల్లడించారు.

పోలీసులు ప్రస్తుతం డాక్టర్ నమ్రతతో పాటు, ఈ వ్యవహారంలో కీలక పాత్ర పోషించిన ఏజెంట్లు, ANMలు, ఆశా వర్కర్ల పాత్రను విచారిస్తున్నారు. ఒక్కొక్క దంపతుల వద్ద ఎంత మొత్తంలో డబ్బులు వసూలు చేశారని, ఎంత మంది పేద తల్లిదండ్రులకు పిల్లలను సరోగసీ పేరుతో విక్రయించారని తెలుసుకునేందుకు ప్రశ్నలు చేస్తున్నారు.

సృష్టి ఫెర్టిలిటీ సెంటర్‌కు సంబంధించిన విజయవాడ, విశాఖపట్నం, హైదరాబాద్ బ్రాంచీలపై పోలీసులు వివరాలను సేకరిస్తున్నారు. ఈ కేంద్రాల్లో ఇప్పటివరకు ఎంతమంది తల్లిదండ్రులు నమోదు చేసుకున్నారన్న దానిపై ప్రత్యేక దృష్టి పెట్టారు. ఈ దంపతుల వివరాలు, వారితో నిర్వహించిన లావాదేవీలు, డబ్బుల పద్ధతులపై ఆధారాలు సేకరిస్తున్నారు.

న్యాయవాదిగా ఉన్న డాక్టర్ నమ్రత కుమారుడు జయంత్ కృష్ణ, ఈ కేసులో బాధిత తల్లిదండ్రులను బెదిరించినట్టు వచ్చిన ఆరోపణలపై కూడా పోలీసులు ఆరా తీస్తున్నారు. బాధితుల పైనా, జయంత్ మానసిక ఒత్తిడిని కలిగించాడా లేదా అనే దానిపై స్పష్టత తీసుకొచ్చేందుకు ప్రాధాన్యత ఇస్తున్నారు.

ఈ కేసులో విచారణలో భాగంగా డాక్టర్ నమ్రత ఎలాంటి పశ్చాతాపం లేకుండా, "మేము పిల్లలను దత్తతకు అరేంజ్ చేసాం" అంటూ బహిరంగంగానే చెప్పినట్టు సమాచారం. ఈ వ్యాఖ్యలు ఆమెపై ఉన్న ఆరోపణలను మరింత బలపరిచే అవకాశం ఉన్నట్లు అధికారులు భావిస్తున్నారు.

పోలీసుల విచారణ కొనసాగుతోంది. మరిన్ని ఆధారాలు వెలుగు చూసే అవకాశం ఉండగా, న్యాయపరంగా ఈ కేసు పెద్ద దిశగా మారబోతుందని అనిపిస్తోంది.






# ప్రజలతో మమేకమే లక్ష్యం

- ప్రజలతో మమేకం కావడమే పాదయాత్ర లక్ష్యం
- గాంధీ నుంచి రాహుల్ గాంధీ వరకు.. పాదయాత్రల ప్రేరణ
- సీఎం రేవంత్ రెడ్డి తదుపరి పాదయాత్రలో పాల్గొననున్న విషయంపై వెల్లడి
- వెన్నుపోటు అయినా సంక్షేమ పథకాల అమలులో రాజీ లేదు : టీపీసీసీ చీఫ్



**హైదరాబాద్ ఆగస్టు 01(ప్రజాస్వరం):**

తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ పరిగి నియోజకవర్గంలో పాదయాత్ర నిర్వహించారు. ఈ యాత్రలో ముఖ్య ఉద్దేశం ప్రజలతో ప్రత్యక్షంగా మమేకం కావడం, వారి సమస్యలు తెలుసుకోవడం అని ఆయన స్పష్టంగా తెలిపారు.

"మేము అధికారంలో ఉన్నా లేకపోయినా ప్రజల మధ్యలో ఉండాలన్న ఉద్దేశంతోనే ఈ పాదయాత్రను ప్రారంభించాం. ఇది కేవలం ఒక రాజకీయ కార్యక్రమం కాదు. ప్రజల జీవితాల్లో ఎదురవుతున్న వాస్తవాలను నేరుగా తెలుసుకోవడానికి, వారి సలహాలు, సూచనలు స్వీకరించడానికి ఇదొక సాధనంలా వుంది," అని మహేష్ కుమార్ గౌడ్ అన్నారు.

గాంధీ యాత్రల నుండి రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జోడో యాత్ర వరకు పాదయాత్రలు దేశ ప్రజలను చైతన్యపరిచిన ఉదాహరణలుగా నిలిచాయని గౌడ్ గుర్తు చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చేసిన పాదయాత్రలు కూడా ప్రజల్లో కొత్త ఆశలు నింపాయన్నారు. అదే దారిలో టీపీసీసీ ఈ పాదయాత్రకు శ్రీకారం చుట్టిందని చెప్పారు.

ఈ యాత్రలో ఏఐసీసీ నాయకురాలు మీనాక్షి నటరాజన్‌తో పాటు రాష్ట్ర మంత్రులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు. తదుపరి పాదయాత్రలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా పాల్గొననున్నట్లు మహేష్ గౌడ్ తెలిపారు.

తెలంగాణ రాష్ట్రాన్ని ఏడున్నర లక్షల కోట్ల అప్పులతో తాము అధికారం చేపట్టామని, అయినప్పటికీ ప్రతి నెలా 6 వేల కోట్ల అప్పు చెల్లిస్తూ, సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని గౌడ్ వివరించారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల నిబంధనపై కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. "ప్రజల ఆకాంక్షలకే స్పందనగా కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడింది. వారికి న్యాయం చేయడమే మా లక్ష్యం," అంటూ ఆయన తన ప్రసంగాన్ని ముగించారు.

# ఉపరాష్ట్రపతి ఎన్నిక షెడ్యూల్

- ఆగస్టు 21 నామినేషన్‌కు చివరి తేదీ
- సెప్టెంబర్ 9న నిర్వహించనున్న ఈసీ
- ఫలితాలు కూడా పోలింగ్ రోజునే
- స్పష్టమైన ఆధిక్యంలో ఉన్న ఎన్డీయే

**న్యూఢిల్లీ, (ప్రజాస్వరం):**

జగదీప్ ధన్‌ఖడ్ రాజీనామా చేయడంతో ఉపరాష్ట్రపతి ఎన్నిక అనివార్యమైన సంగతి తెలిసిందే. తదుపరి వైస్ ప్రెసిడెంట్ ఎన్నికకు సంబంధించిన ప్రక్రియను ఎన్నికల కమిషన్ మొదలుపెట్టింది. ఇందులో భాగంగా శుక్రవారం షెడ్యూల్ విడుదల చేసింది. సెప్టెంబర్ 9న ఎన్నిక నిర్వహించనున్నట్టు ఈసీ ప్రకటించింది. ఈ ఎన్నికకు సంబంధించిన అధికారిక నోటిఫికేషన్‌ను ఆగస్టు 7న విడుదల చేయనున్నట్టు తెలిపింది. నామినేషన్ దాఖలుకు చివరి తేదీ ఆగస్టు 21గా నిర్ణయించింది. పోలింగ్ జరిగే రోజు సెప్టెంబర్ 9న ఎన్నిక ఫలితాలను కూడా ప్రకటిస్తామని ఈసీ ప్రకటించింది. కాగా, ఈ ఎన్నికలో లోక్‌సభ, రాజ్యసభ ఎంపీలు, నామినేటెడ్ ఎంపీలు ఓట్లు వేయాల్సి ఉంటుంది.

**ఆధిక్యంలో ఉన్నదెవరు?**

రాజకీయ సమీకరణాల విషయానికొస్తే, అధికార బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే స్పష్టమైన ఆధిక్యం కనిపిస్తోంది. లోక్‌సభలో మొత్తం సభ్యుల సంఖ్య 545 కాగా, ప్రస్తుతం ఒక్క స్థానం మాత్రమే ఖాళీగా ఉంది. ఇక, రాజ్యసభలో మొత్తం సభ్యుల సంఖ్య 245 కాగా, ప్రస్తుతం ఐదు ఖాళీలు ఉన్నాయి. రాజ్యసభలో ఖాళీ అయిన 5 స్థానాల్లో 4 జమ్మూ కశ్మీర్‌లోనివి కాగా, ఒకటి పంజాబ్‌కు చెందినది. ఉభయ సభల్లో కలిపితే ప్రస్తుతం మొత్తం 782 మంది సభ్యులు ఉన్నారు. ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకుంటే, విజేతగా నిలవాలంటే కనీసం 391 ఓట్లు అవసరం అవుతాయి. లోక్‌సభలో ఉన్న 542 మంది సభ్యుల్లో ఎన్డీఏకు 293 మంది మద్దతు ఉంది. రాజ్యసభలో ప్రస్తుత బలం 240 ఉండగా ఎన్డీఏకు 129 మంది మద్దతుదారులున్నారు. నామినేటెడ్ సభ్యులు కూడా ఎన్డీఏ పక్షాన ఉంటారని భావిస్తే ఈ సమీకరణం వాస్తవరూపం దాల్చుతుంది. ఈ విధంగా ఎన్డీయేకు మొత్తం 422 మంది సభ్యుల మద్దతు ఉంది.

# కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేరుస్తోంది.

**ఎమ్మెల్యే మేఘారెడ్డి.**

**వనపర్తి ఆగష్టు 01(ప్రజాస్వరం):**

కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన గ్యారంటీలను నెరవేర్చడంతో పాటు ప్రజల అవసరాలను గుర్తించి అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతుందని ఎమ్మెల్యే మేఘా రెడ్డి అన్నారు. శుక్రవారం నియోజకవర్గంలోని పెబ్బేరులో నిర్వహించిన తెల్లరేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమానికి ఎమ్మెల్యే మేఘా రెడ్డి, కలెక్టర్ ఆదర్శ్ సురభిలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తెల్ల రేషన్ కార్డుల గురించి ప్రజలు 10 సంవత్సరాలు ఎదురు చూసారని కానీ గత పాలకులు ఇవ్వలేకపోయారని విమర్శించారు. పది సంవత్సరాల్లో వాళ్లే లబ్ధి పొందారు తప్ప ప్రజలకు చేసిందేమీ లేదన్నారు. 10 సంవత్సరాల నుండి కొత్త రేషన్ కార్డులు లేక పెళ్లి అయిన వారి పేర్లు, పిల్లల పేర్లు రేషన్ కార్డుల్లో చేర్పించకపోవడంతో లబ్ధిదారులు చాలా నష్టపోవడం జరిగిందని అన్నారు. ఈ ప్రభుత్వం వచ్చాక ఇచ్చిన హామీలను నెరవేర్చడంతో పాటు ప్రజలకు అవసరమైన అన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతుందని తెలిపారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం సౌకర్యం కల్పించడం జరిగింది అన్నారు. 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తు, 500 రూపాయలకే సిలిండర్లు ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ రెండు పథకాల్లో కొంత సాంకేతిక సమస్య వల్ల కొంతమందికి లబ్ధి చేకూరడం లేదని త్వరలోనే సమస్యను పరిష్కరించి అర్హులందరికీ లబ్ధి చేకూరుస్తామన్నారు. నిరుపేద ప్రజల సొంతింటి కల నెరవేర్చేందుకు ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లు ఇస్తుందన్నారు. పార్టీలకతీతంగా పారదర్శకంగా అర్హులైన వారికి ప్రతి నియోజకవర్గంలో 3500 ఇళ్ళు మంజూరు చేసి ఒక్కో ఇంటికి రూ. 5 లక్షలు లబ్ధిదారుల ఖాతాల్లో జమచేయడం జరుగుతుందన్నారు. ఇప్పుడు రాని వారికి రెండవ దఫా మళ్ళీ ఇందిరమ్మ ఇళ్ళు మంజూరు చేయడం జరుగుతుందన్నారు. జిల్లాలోని మహిళలకు 360 కోట్లు వడ్డీ లేని రుణాలు అందజేయడం జరిగింది. రైతు భరోసా, రైతు రుణమాఫీ తదితర పథకాలు అమలు చేసినట్లు తెలిపారు. రెండు లక్షల రూపాయల వరకు ఉన్న రైతుల రుణాలను 21 వేల కోట్లతో రైతు రుణమాఫీ చేయడం జరిగిందన్నారు. వనపర్తి, పెబ్బేరు రోడ్డు విస్తరణ పనులు త్వరలో పూర్తి అవుతుందన్నారు. పెబ్బేరు మున్సిపాలిటీలో అన్ని ప్రభుత్వ కార్యాలయాలు ఏర్పాటు చేసేవిధంగా బాధ్యత తీసుకుంటానని అన్నారు. పెబ్బేరు మున్సిపాలిటీలో కొత్త గోదాము, ప్రభుత్వ ఆసుపత్రి ఏర్పాటుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వెంకటేశ్వర్లు, ఆర్డీఓ సుబ్రమణ్యం, జిల్లా సివిల్ సప్లై అధికారి కాశీ విశ్వనాథ్, తహసిల్దారు మురళి, మార్కెట్ కమిటి చైర్మన్ ప్రమోదిని, వైస్ చైర్మన్ విజయవర్ధన్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల ముఖ్య నాయకులు, రేషన్ కార్డు లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.





# నకిలీ విత్తనాలపై రైతులకు అవగాహన

**అత్మకూర్, ఆగస్టు 1(ప్రజాస్వరం):** అత్మకూర్ మండల వ్యవసాయ అధికారి, మండల టాస్క్ ఫోర్స్ బృందంతో కలిసి మండలంలోని ఎరువుల దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా, ఎరువుల డీలర్లు తమ దుకాణాల్లో యూరియా స్టాక్ బోర్డు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని, అలాగే యూరియాను యం ఆర్ పి కంటే ఎక్కువ ధరకు అమ్మితే కఠిన చర్యలు తీసుకోబడతాయని ఆదేశించారు. తనిఖీల సందర్భంగా మహేశ్వరీ ట్రేడర్స్, బషీర్ ఏజెన్సీస్, అగ్రో రైతు సేవా కేంద్రం, సంకల్ప్ రిటైల్ స్టోర్స్, మరియు జువారీ ఫామ్ హబ్ లిమిటెడ్ దుకాణాలను సందర్శించారు.



# కాప్రా జిహెచ్ఎంసి మాన్సూన్ స్పెషల్ డ్రైవ్

**కాప్రా ఆగష్టు 01(ప్రజాస్వరం):**

జిహెచ్ఎంసి కమిషనర్ ఆదేశాలమేరకు జిహెచ్ఎంసి అంతట కొనసాగిస్తున్న, వర్షాకాలం ముందస్తు చర్యల్లో భాగంగా నాల్గవ విడత ప్రీమానుసూన్ స్పెషల్ డ్రైవ్ కాప్రా సర్కిల్ ఏఎస్ రావునగర్ డివిజన్ గాంధీనగర్, శ్రీనివాస్ నగర్, లక్ష్మీపురం, బృందావన్ కాలనీ, అరుణ్ కాలనీ, త్యాగరాయ నగర్, అయోధ్య నగర్, రుక్మిణి పూరి ప్రాంతాల యందు ఈ కార్యక్రమం నిర్వహించారు. మున్సిపల్ అధికారులు సిబ్బంది ఈకార్యక్రమంలో ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్లపైకి వచ్చిన ఇసుకమేటల్ల ను, పేరుకుపోయిన చెత్తను తొలగించడం, గ్రీన్ వేస్ట్ తొలగించడం, జరిగింది రోడ్ల వర్షానికి రోడ్లపై ఏర్పడిన గుంతలను పూడ్చడానికి డిప్యూటీ కమిషనర్ జగన్ సంబంధిత అధికారులను చర్యలు తీసుకోవాల్సిందిగా ఆదేశించారు. ఈకార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ జగన్, సి ఎం ఓ హెచ్ పద్మజ, ఈ నాగేందర్, డి.ఈ బాలకృష్ణ, ఏ.ఈ కీర్తిశ్రీ టౌన్ ప్లానింగ్ డిసిపి కృష్ణ మోహన్, యు సి డి సెక్షన్ డిపిఓ దామోదర్ రెడ్డి, పారిశుద్ధ్య విభాగము ఏ ఎం ఓ హెచ్ మధుసూదన్ రావు సానిటరీ సూపర్వైజర్ సుదర్శన్ ఎంటమాలజీ ఏఈ రమేష్, సంబంధిత విభాగాల సిబ్బంది పాల్గొన్నారు. ఈ యొక్కడ్రైవ్ ఆగస్టు 8వరకు వివిధ వార్డుల యందు జరుగుతుందని డిప్యూటీకమిషనర్ తెలియజేశారు. కుషాయిగూడ గవర్నమెంట్ స్కూల్ ప్రిన్సిపల్ పద్మావతి మరియు టీచర్లు, విద్యార్థినీ, విద్యార్థులువారి పాఠశాల యందు ఈసందర్భంగా పిచ్చిమొక్కలు తొలగించడం, చెత్తాచెదారాన్ని తొలగించడం జరిగింది. ప్రభుత్వం ఇచ్చినటువంటి ఆదేశాల మేరకు స్వచ్ఛభారత్ లో భాగంగా" సఫాయి అప్నాఓ భీమారి భగాఓ" కార్యక్రమాన్ని విద్యార్థులకు తెలియజేయడంలో భాగంగాఈ సందర్భంగా జిల్లాపరిషత్ స్కూల్ కుషాయిగూడ విద్యార్థిని, విద్యార్థులకు వర్షాకాలంవచ్చే అంటూవ్యాధుల గురించి వ్యక్తిగత పరిశుభ్రత, ఇంటి పరిశుభ్ర టాయిలెట్ల పరిశుభ్రత, నైబర్హుడ్ వారి పరి శుభ్రత ,నీటి వనరుల పరిశుభ్రత విషయమై విద్యార్థులకు అవగాహన కల్పించారు. పారిశుద్ధ్య సిబ్బందితోపాటు అంటువ్యాధులు ప్రబలకుండా వర్షాకాలంలో వర్షపు నీటి వలన ఎదుర్కొనే ముంపు ప్రాంతాలను ముందే గుర్తించి వర్షాకాలంలో ప్రభవలే అంటు వ్యాధులను ముందస్తుగా అరికట్టేందుకు ఈకార్యక్రమం జరుగుతుందని డిప్యూటీకమిషనర్ జగన్ తెలియజేశారు





# నేడే చేవెళ్ల కు మందకృష్ణ మాదిగ రాక

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి, ఆగస్టు 01(ప్రజాస్వరం):**

వికలాంగుల, వితంతువుల, పెన్షన్ సన్నాక సమావేశానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర వ్యవస్థాపకులు పద్మశ్రీ అవార్డు గ్రహీత మందకృష్ణ మాదిగ చేవెళ్ల కు విచ్చేయుచున్నట్లు షాబాద్ మండల అధికార ప్రతినిధి, మల్కి ప్రవీణ్ ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం షాబాద్ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశానికి ముఖ్యఅతిథిగా ఎం ఎస్ పి జిల్లా వర్కింగ్ అధ్యక్షులు ఎమ్మార్పీఎస్, షాబాద్ మండల్ ఇన్చార్జి కేసారం శంకర్ రావు మాదిగ, హాజరయ్యారు, కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం వృద్ధుల వితంతువుల పెన్షన్ 2000 నుంచి 4000 మరియు వికలాంగులకు 4000 నుండి 6000 వరకు పెన్షన్ పెంచుతామని కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని తలపెట్టిన కార్యక్రమానికి షాబాద్ మండలం మారుమూల గ్రామాల వితంతువులు, వికలాంగులు పెద్ద ఎత్తున తరలివచ్చి సభలు విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమం చేవెళ్ల వెంకటేశ్వర గార్డెన్ ఊరెళ్ళ రోడ్డు, నందు సభా కార్యక్రమం నిర్వహించబడును కావున అందరూ హాజరు కావాలని షాబాద్ మండల అధ్యక్షులు అక్కముల జంగయ్య ఎమ్మార్పీఎస్, అక్కముళ్ల అంజయ్య అంబేద్కర్ సంఘం అధ్యక్షులు తాళ్లపల్లి , ఎమ్మార్పీఎస్, ఎమ్మార్పీఎస్ మండల నాయకులు, అల్లాడ సుదర్శన్ ఎమ్మార్పీఎస్, సీనియర్ నాయకులు బండి ప్రభాకర్, బొబ్బిలి గమ మల్లేష్, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



# ఉర్దూ జర్నలిస్టుకు పరామర్శ.

**వనపర్తి ఆగష్టు 01(ప్రజాస్వరం):**

వనపర్తి జిల్లా కేంద్రానికి చెందిన సీనియర్ ఉర్దూ జర్నలిస్ట్ సిద్ధిక్ ను టీయూడబ్ల్యూజే 143 సంఘం జర్నలిస్టులు పరామర్శించారు. కిడ్నీ సంబంధిత జబ్బుతో బాధపడుతూ మహబూబ్నగర్ లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో శస్త్ర చికిత్స చేయించుకున్న అనంతరం చిట్యాల డబల్ బెడ్ రూమ్ కాలనీలోని తన నివాసంలో విశ్రాంతి తీసుకుంటున్న ఆయనను సంఘం నేతలు శుక్రవారం సాయంత్రం పరామర్శించి మనోధైర్యం కల్పించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు బక్షి శ్రీధర్ రావు, రాష్ట్ర కార్యదర్శి మోడాల చంద్రశేఖర్, నరసింహారెడ్డి, శ్రీనివాస యాదవ్, గోర్ల రాజు, సుంకరి రమేష్, అశోక్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# బాలకార్మిక వ్యవస్థను నిర్మూలిద్దాం

**చర్లపల్లి ఆగస్ట్ 01(ప్రజాస్వరం):** ఆపరేషన్ ముస్కాన్ 11లో భాగంగా రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్ బాబు ఆదేశానుసారం రాచకొండ మానవ అక్రమ నిరోధక విభాగం, ముస్కాన్ టీం ఆధ్వర్యంలో చర్లపల్లి ఇండస్ట్రియల్ ఏరియాలోని టీకెఐఆర్ కంపెనీలో శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. బాలకార్మిక వ్యవస్థను నిర్మూలిద్దాం, వారి విద్యా అభివృద్ధికి తోడ్పడుదాం.. అనే నినాదంతో మల్కాజిగిరి డివిజన్ ముస్కాన్ టీం సబ్ ఇన్స్పెక్టర్ పుల్లారెడ్డి అవగాహన కల్పించారు.



ప్రజాస్వరం
PRAJASWARAM
తెలుగు దినపత్రిక
02.08.2025
శనివారం | హైదరాబాద్
www.prajaswaramdaily.com




# దుపెల్లి గ్రామంలో ఉచిత కంటి వైద్య శిబిరం

**వలిగొండ ఆగస్టు 01(ప్రజాస్వరం):**యాదాద్రి భువనగిరి జిల్లా శుక్రవారం రోజున వలిగొండ మండలంలోని దుపెల్లి గ్రామంలో శంకర కంటి ఆసుపత్రి నానక్ రామ్ గూడ, హైదరాబాద్ (శ్రీ కంచి కామకోటి మెడికల్ ట్రస్ట్), మరియు జిల్లా అందత్వ నివారణ సంస్థ యొక్క ఆధ్వర్యంలో కంప్యూటర్ ద్వారా ప్రాథమిక ఉచిత కంటి పరీక్ష శిబిరం నిర్వహించడం జరిగింది, ఈ శిబిరంలో దాదాపు 50 మంది కంటి పరీక్షలు చేసుకున్నారు, అందులో 10 మందికి కంటి ఆపరేషన్లు అవసరం ఉన్నాయని ఆస్పత్రి సిబ్బంది తెలిపారు, ఈ యొక్క కార్యక్రమంలో ఆసుపత్రి సిబ్బంది, డాక్టర్ ఉమామహేశ్వర్, శ్రీకళ, శ్రీకాంత్, బాలరాజు, మరియు గ్రామపంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, కారోబార్ రాజు, గ్రామ పెద్దలు మద్దెల గోపి, మొగిలి కృష్ణ, కట్టెల నరసయ్య, నీల రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాల సంఖ్య పెంచాలి.

- ప్రతి శుక్రవారం డ్రై డే నిర్వహించాలి.
- సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలి.
- జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి.


**వనపర్తి ఆగష్టు 01(ప్రజాస్వరం):** పేద గర్భిణులు ప్రైవేట్ ఆసుపత్రుల్లో ప్రసవాలు చేసుకొని అనవసరంగా డబ్బులు వృథా చేసుకోకుండా ప్రభుత్వ ఆసుపత్రిలో సురక్షితమైన ప్రసవాలు జరుగుచున్న విషయాన్ని గ్రామీణ స్థాయిలో అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. శుక్రవారం ఉదయం కలెక్టర్ పెబ్బేరు ప్రాథమిక ఆసుపత్రిని సందర్శించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో గర్భిణుల ఈడిడి రిజిస్టరు, ప్రసవాల నమోదు రిజిస్టరు, రక్త పరీక్షల రిజిస్టరు ను పరిశీలించారు. పెబ్బేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి సంబంధించిన ఆశా కార్యకర్తతో మాట్లాడి ఆశా ద్వారా పిహెచ్సికి తీసుకొచ్చిన గర్భిణుల వివరాలు, వారికి చేయించిన ఎ. ఎన్.సి పరీక్షలు, ఎక్కడ ప్రసవాలు జరిగాయి వంటి విషయాలపై వివరాలు అడిగారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో గర్భిణుల ప్రసవాలకు అవసరమైన మౌలిక సదుపాయాలు, వైద్యులు అందుబాటులో ఉన్నారని అలాంటప్పుడు గర్భిణులు ప్రైవేట్ ఆసుపత్రిలో ప్రసవానికి వెళ్లి డబ్బులు ఖర్చు చేసుకోవడం అనవసరం అనే విషయాన్ని గర్భిణులకు వారి కుటుంబ సభ్యులకు అవగాహన కల్పించాలని సూచించారు.ప్రతి గర్భిణికి సకాలంలో ఎ. ఎన్.సి చికిత్సలు చేయించడం, రక్త హీనత రాకుండా ఎప్పటికప్పుడు మందులు, పౌష్టికాహారం తీసుకోవడంపై అవగాహన కల్పించి ప్రభుత్వ ఆసుపత్రిలోనే ప్రసవాలు చేసే విధంగా చూడాలని ఆశా కార్యకర్తలను ఆదేశించారు.ప్రతి శుక్రవారం డ్రై డే కార్యక్రమం పకడ్బందీగా నిర్వహించాలని, నిలువ నీరు ఉంచకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఎక్కడైనా డెంగ్యూ కేసులు నమోదు అయితే వెంటనే సోర్స్ గుర్తించి తొలగించాలని సూచించారు.



చుట్టుపక్కల ఉన్న ఇళ్లలో రక్త నమూనాలు తీసుకొని పరీక్షలు చేయాలని సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రికి జ్వరము , జలుబు, ఒళ్ళనొప్పుల తో వచ్చే రోగులకు అందరికీ రక్త పరీక్షలు నిర్వహించాలని సూచించారు. ఎవరికైన ర్యాట్ పరీక్షలో పాజిటివ్ వస్తె వెంటనే ఎలిజా పరీక్ష చేసేందుకు టి హబ్ కు పంపించాలని ఆదేశించారు. జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డా శ్రీనివాసులు, ప్రోగ్రాం ఆఫీసర్లు డా సాయినాథ్ రెడ్డి, డా. పరిమళ తదితరులు ఉన్నారు.

# కూన వెంకటేష్ గౌడ్ విగ్రహాన్ని ఆవిష్కరించిన మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్

**కుత్బుల్లాపూర్ ఆగష్టు 01(ప్రజాస్వరం):**ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం టీడీపీ బీసీ సెల్ అధ్యక్షులు, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, సహృదయులు కూన వెంకటేష్ గౌడ్, సేవలు, జ్ఞాపకాలు చిరుకాలం ప్రజల మదిలో మేదిలే విధంగా తన కుమారులు కూన శ్రావణ్ గౌడ్, కూన గౌరిశంకర్ గౌడ్ మరియు తన కుటుంబ సభ్యులు గాజులరామారంలో కెవిఎస్ కన్వెన్షన్ లో కూన వెంకటేష్ గౌడ్ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. శుక్రవారం కూన వెంకటేష్ గౌడ్ జన్మదినం సందర్భంగా కెవిఎస్ కన్వెన్షన్ లో మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలం గౌడ్ కూన అంతయ్య గౌడ్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. అనంతరం సహృదయులు కూన వెంకటేష్ గౌడ్ జ్ఞాపకార్ధంగా తన కుమారులు శ్రీ శ్రీ వెంకటేశ్వరా స్వామి దేవాలయానికి బంగారు తోరణలు అందజేశారు. ఈ కార్యక్రమంలో వారి కుటుంబ సభ్యులు, కూన కుటుంబ సభ్యులు, నాయకులు, ప్రజలు, అభిమానులతో పాటు తదితరులు పాల్గొన్నారు.



# ఇందుర్తి మహమ్మదీయ మస్జిద్ నూతన కమిటీ ఎన్నిక

**అధ్యక్షుడుగా మహమ్మద్ రఫీ..**
**కార్యదర్శిగా ఉస్మాన్ పాషా**
**ఏకగ్రీవంగా ఎన్నిక**

**చిగురుమామిడి ఆగష్టు 01(ప్రజాస్వరం):** మండలంలోని మేజర్ గ్రామమైన ఇందుర్తి మహమ్మదీయ మస్జిద్ కు, ముస్లిం మైనారిటీ కమ్యూనిటీకి నూతనంగా ఎన్నికైన కమిటీనీ శుక్రవారం (జుమా) నమాజ్ అనంతరం అధికారికంగా ప్రకటించారు. నూతన కమిటీ అధ్యక్షుడిగా (సదర్ సాబ్) మహమ్మద్ రఫీ, ఉపాధ్యక్షుడుగా షేక్ ఎక్బాల్ జానీ, కార్యదర్శిగా మహమ్మద్ ఉస్మాన్ పాషా, సహాయ కార్యదర్శిగా మహమ్మద్ షంషీర్ అలీ, కోశాధికారిగా మహమ్మద్ చాంద్ పాషా ఖురేషి, కార్యవర్గ సభ్యులుగా ఎండి అశ్ఫాక్, షేక్ సిరాజ్, ఎండి. ఖాసీం, ఎండి. రాజ్ మహమ్మద్, ఎండి సాధిక్, షేక్ ఉమర్, ఎండి అబ్దుల్ కరీం పాషాలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నూతనంగా ఎన్నికైన పాలకవర్గ సభ్యులు మాట్లాడుతూ.. మస్జిద్ అభివృద్ధికి తోడ్పాటునందిస్తామని, మస్జిద్, ఖబ్రస్థాన్, ఈద్గాకు సంబంధించిన పెండింగ్లో ఉన్న పనులు పూర్తి చేసేందుకు శాయ శక్తుల కృషి చేస్తామని పేర్కొన్నారు. గ్రామానికి సంబంధించినటువంటి ముస్లిం సోదరులు ఎదుర్కొంటున్నటువంటి సమస్యలను పరిష్కారం చేసే దిశగా కృషి చేస్తామన్నారు. నూతన కమిటీని ఎన్నుకున్న గ్రామ ముస్లిం సోదరులందరికీ కృతజ్ఞతలు తెలిపారు.



# వలిగొండలో వంట బిల్లులు వెంటనే చెల్లించాలి

**వలిగొండ ఆగష్టు 01(ప్రజాస్వరం):**యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ ప్రభుత్వ పాఠశాలలో వంట బిల్లులు రాక నిర్వాహకురాలు శ్యామల యాదమ్మ ఆవేదన వ్యక్తం చేశారు . గత 5 నెలల నుండి ఈ సంవత్సరము రెండు నెలల బిల్లులు పెండింగ్లో ఉన్నాయని అన్నారు. అప్పులు చేసి వంటలు చేస్తున్నామని మా బాధలు ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. అధికారులు వెంటనే స్పందించి తమ సమస్యలు పరిష్కరించాలని ఆమె తెలిపారు.





# ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలి

**ప్రజాభవన్ లో మాజీ మంత్రి చిన్నారెడ్డి కి వినతి పత్రం అందజేసిన ఉద్యమకారులు**

**వలిగొండ ఆగష్టు 01(ప్రజాస్వరం):**టియుజేఏసీ ఉద్యమకారులు తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పోరాటాలు చేసిన ఉద్యమకారులకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని శుక్రవారం హైదరాబాద్ ప్రజా భవన్ లో మాజీ మంత్రి చిన్నారెడ్డికి తెలంగాణ మలిదశ ఉద్యమకారులు టియు.జేఏసీ నాయకులు సంగిశెట్టి క్రిస్టఫర్, ఈతాప మల్లేశం, గడ్డమీది పరశురాములు మెమోరాండం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర సాధన కోసం అనేకమంది అమరులయ్యారని మరి కొంతమంది కేసుల పాలయ్యారని వారిని గుర్తించడానికి వెంటనే ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయాలని వారు అన్నారు.



# శంకర్ గౌడ్ అంకిత భావంతో పనిచేసి వృత్తికి వన్నెతెచ్చారు.

- శేష జీవితం కాదు విశేషమైన జీవితాన్ని సమాజ సేవకు అంకితం చేయాలి.
- మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి.

వనపర్తి ఆగష్టు 01(ప్రజాస్వరం): సాహితీ కళా వేదిక జిల్లా అధ్యక్షులు యాపర్ల జడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు పలుస శంకర్ గౌడ్ ఉపాధ్యాయ వృత్తికి అంకిత భావంతో పనిచేసే వృత్తికే వన్నెతెచ్చారని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి అన్నారు. శుక్రవారం శ్రీ లక్ష్మీ కృష్ణ గార్డెన్ లో ఆయన పదవీ విరమణ వీడ్కోలు సభను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి తో పాటు మాజీ ఎమ్మెల్యే రావుల చంద్రశేఖర రెడ్డి లు హాజరై ఆయనకు శాలువాలు కప్పి పుష్పగుచ్చాలు అందజేసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా రావుల చంద్రశేఖర రెడ్డి మాట్లాడుతూ పలుస శంకర్ గౌడ్ పదవీ విరమణ పొందినప్పటికీ శేష జీవితాన్ని విశేషమైన సమాజ సేవకు అంకితం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గట్టు యాదవ్ వామన్ గౌడ్ వాకిటి శ్రీధర్ పలుస రమేష్ గౌడ్, నందిమల్ల అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే మెగా రెడ్డి ఆర్థిక సాయం

**పెద్దమందడి ఆగష్టు 01(ప్రజాస్వరం):**పెద్దమందడి మండలం దొడగుంటపల్లి గ్రామానికి చెందిన ముదిరాజ్ సంఘం గౌరవ అధ్యక్షుడు తెలుగు జంగం నాగన్న సతిమణి రాములమ్మ శుక్రవారం తెల్లవారు జామున గుండెనొప్పితో మృతి చెందింది. విషయం తెలుసుకున్న వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి వారి కుటుంబ సభ్యులకు తక్షణ సహాయంగా మేఘన్న ఆత్మీయ భరోసా ద్వారా రూ 5000 తన పి ఆర్ ఓ గోపాల్ ద్వారా మృతురాలి భర్త నాగన్నకు అందజేశారు. కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ నాయకులు సుదర్శన్, ముదిరాజ్ సంఘం నాయకులు కృష్ణయ్య, తిరుపతి, నిరంజన్, టైలర్ కుర్మయ్య, మాజీ ఎంపిటిసి బాలప్ప, సైదులు, డి కృష్ణయ్య, వెంకయ్య, రాములు, పెద్దమందడి నాగభూషణం, బుద్ధారం శేఖర్, నిలేందర్ తదితరులు పాల్గొన్నారు.






# మండల కేంద్రంలో సుంకిశాల రోడ్డులో ఏర్పడిన గుంతను పూడ్చాలి.

**వలిగొండ ఆగస్ట 01(ప్రజాస్వరం):**యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల కేంద్రంలో సుంకిశాల రోడ్డులో ఏర్పడిన గుంతను పూడ్చాలని సిపిఎం మండల కార్యదర్శి సిర్పంగి స్వామి, మండల కార్యదర్శి వర్గ సభ్యులు కూర శ్రీనివాస్ లు డిమాండ్ చేశారు. శుక్రవారం రోజున మండల కేంద్రంలోని సుంకిశాల రోడ్డులో కమాన్ వద్ద ఏర్పడిన గుంత వల్ల అనేకమంది ప్రయాణికులు ఇబ్బంది పడుతున్న పట్టించుకోని అధికారుల నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సుమారు నెల రోజులుగా గుంత ఏర్పడి ఆ రోడ్డు మార్గం ద్వారా ప్రయాణం చేసే పట్టణ కేంద్రానికి చెందిన ప్రయాణికులతో పాటు, సుంకిశాల, పులిగిల్ల గ్రామాలకు చెందిన ప్రయాణికులతో పాటు ఇతర గ్రామాలకు వెళ్లే ప్రయాణికులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారని ఈ రోడ్డు మార్గం ద్వారా వలిగొండ నుండి కాటేపల్లి వరకు కొనసాగుతున్న డబుల్ రోడ్డు నిర్మాణం కోసం వెళ్లే అనేక మట్టి కంకర టిప్పర్లతోపాటు సుంకిశాల గ్యాస్ కంపెనీకి చెందిన వాహనాలు నిరంతరం ప్రయాణించడం జరుగుతుందని అధికారులు ఈ రోడ్డు మార్గం ద్వారా రోడ్డు పనులను పర్యవేక్షించేందుకు నిరంతరం ప్రయాణం చేస్తున్న ఏమాత్రం పట్టించుకోకపోవడం నిర్లక్ష్యానికి నిదర్శనమని వెంటనే ఇప్పటికైనా అధికారులు స్పందించి గుంతను పూడ్చాలని డిమాండ్ చేశారు ఈ గుంతలో అనేకమంది ద్విచక్ర ప్రయాణికులు ఇప్పటికే పడిపోయారని ఎవ్వరికి ఎలాంటి ప్రమాదం జరగక ముందే అధికారులు స్పందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పట్టణ కార్యదర్శి గర్దాసు నరసింహ, మండల కమిటీ సభ్యులు కొండే కిష్టయ్య, ఉద్యమకారుల సంఘం జిల్లా నాయకులు బత్తిని రవీందర్, సిపిఎం పట్టణ నాయకులు కొండూరు సత్తయ్య, శీలం ఇందిర, వేముల లక్ష్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

# అర్హులైన పేదలకు యందు మంజూరు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం

**సిపిఐ పట్టణ కార్యదర్శి ఏ రవీందర్**

**అమరచింత ప్రతినిధి ఆగష్టు 01(ప్రజాస్వరం):**అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని సిపిఐ అమరచింత పట్టణ కార్యదర్శి ఏ రవీందర్ ఆరోపించారు. శుక్రవారం అమరచింత మునిసిపాలిటీ కేంద్రంలోని 4, 8 వార్డుల్లో ఇల్లు లేని పేదలను కలిశారు. 8 వార్డులో నూర్జహాన్ బేగం, మలేఖ బేగం, షాహిన్ బాధితులు తమకు స్థలం ఉన్న ప్రభుత్వం ఇల్లు కేటాయించలేదని సిపిఐ నాయకులతో వాపోయారు. అనంతరం నాలుగో వార్డులో సామేలు అనే నిరుపేదను కలిశారు. ఇందిరమ్మ ఇండ్లు వస్తాయని పూరిగుడిసెను తొలగించి ఖాళీ స్థలం అధికారులకు చూపించిన నాయకులు గాని అధికారులు కానీ పట్టించుకోలేదని బాధితుడు సామేలు వాపోయారు. అనంతరం రవీందర్ మాట్లాడుతూ అమరచింత మునిసిపాలిటీ కేంద్రంలో గురువారం రాత్రి మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి ఇండ్ల ప్రొసీడింగ్స్ పంపిణీ చేస్తూ అర్హులైన పేదలకే కాంగ్రెస్ ప్రభుత్వం ఇల్లు పంపిణీ చేస్తుందని చెప్పడం విచిత్రంగా ఉందన్నారు. పట్టణంలో ఎంతోమంది అర్హులైన పేదలు ఉన్న వారికి ఇల్లు ఎందుకు ఇవ్వడంలేదని ప్రశ్నించారు. పట్టణంలోని 10 వార్డుల్లో నిరుపేదలు చాలామంది అర్హులు ఉన్నారని వారి అందరిని గుర్తించి వెంటనే ఇండ్లు మంజూరు చేయాలని లేని పక్షంలో మున్సిపాలిటీ కార్యాలయం ముందు సిపిఐ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మాజీ పట్టణ కార్యదర్శి భాస్కర్ జిల్లా నాయకులు శ్యాంసుందర్ జిల్లాఐఫ్ కార్యదర్శి ఎండి కుతుబ్ పాల్గొన్నారు.



# నేడు చేవెళ్లకు మంద కృష్ణ మాదిగ రాక

**శంకర్‌పల్లి ఆగష్టు 01(ప్రజాస్వరం):**

వృద్ధులు, వితంతువుల చేయూత పెన్షన్ రూ. 4 వేలకు, వికలాంగుల పెన్షన్ రూ 6 వేలకు పెంచాలని, సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన మాటకు కట్టుబడి పెన్షన్ హామీని నెరవేర్చాలని, అర్హులైన ప్రతి ఒక్కరికి అంటే కొత్త వారికి కూడా పెన్షన్లు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ సభ జరుగుతుంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ హాజరవుతున్నారని కాడిగల్ల ప్రవీణ్ అన్నారు. చేవెళ్లలోని వెంకటేశ్వర ఫంక్షన్ హాల్ లో మధ్యాహ్నం సభ జరుగుతుందని, ప్రతి ఒక్కరికి భోజన సౌకర్యాలు ఉన్నాయి. అన్ని గ్రామాల్లో ఉన్న పెన్షన్ దారులు, పెన్షన్ రాని వాళ్లు, వికలాంగులు, వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, చేనేత కార్మికులు, గీత కార్మికులు, బీడీ కార్మికులు, బోదకాలు బాధితులు, హెచ్ఐవి, డయాలసిస్ బాధితులను, చేయూత పరిధిలోకి వచ్చే పెన్షన్ దారులందరూ గ్రామాల్లో ప్రత్యేక వాహనాలు ఏర్పాటు చేసుకొని అధిక సంఖ్యలో సభకు తరలి రావాలని కోరారు.



# చక్కెర, బెల్లం.. ఏది మంచిది..?



బెల్లం, చెక్కర ఏది మంచిది? ఈ ప్రశ్న ఇప్పటిది కాదు. దశాబ్దాలుగా ప్రజలను సతమతం చేస్తున్న విషయం. చాలా మంది బెల్లమే మంచిది అని చెప్తారు. కానీ కొందరు మాత్రం చెరుకు నుంచి తీసే పంచదార ఎందుకు కీడు చేస్తుందని ప్రశ్నించే వారూ ఉన్నారు. మెటబాలిక్ హెల్త్ కోచ్ కరణ్ సారిన్ ఒక ముఖ్యమైన విషయాన్ని చెబుతున్నారు. బెల్లమైనా, ఏ ఇతర తీపి పదార్థమైనా సరే, చాలా తక్కువ మోతాదులో మాత్రమే తీసుకోవాలట. ఎందుకంటే, ఆయన దృష్టిలో 'చక్కెర అనేది కొత్త పొగాకు' లాంటిది. మీరు బరువు తగ్గాలని చూస్తున్నా, లేదంటే మంచి ఆహారపు అలవాట్లు అలవర్చుకోవాలనుకుంటున్నా తెల్ల చక్కెరను తగ్గించడం సరైన దారి. 'మెడికల్ న్యూస్ టుడే' ప్రకారం కేవలం అరకప్పు చక్కెరలో దాదాపు 385 కేలరీలు, 100 గ్రాముల చక్కెర ఉంటాయి. అయినా సరే, చాలా మందికి ఉదయం కాఫీ నుండి తీపి వంటల వరకు చక్కెర లేకుండా రోజు గడవదు. మనకు బెల్లం లాంటి ప్రత్యామ్నాయాలు ఉన్నాయి. కానీ, ఇది నిజంగా తెల్ల చక్కెర కంటే ఆరోగ్యకరమైందా? ఇక్కడ చూద్దాం.

**ఏది బెస్ట్..**

హెచ్‌టీ లైఫ్‌స్టైల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో,మెటబాలిక్ హెల్త్ కోచ్ కరణ్ సారిన్ బెల్లం గురించి ప్రచారంలో ఉన్న ఒక అపోహను బయటపెట్టారు. "అవును, బెల్లం సహజమైనది. శుద్ధి చేయనిది. కొందరైతే దీనిని 'ఔషధ చక్కెర' అని కూడా పిలుస్తారు. భారతదేశంలో చాలా కాలంగా, తెల్ల చక్కెర కంటే బెల్లమే ఆరోగ్యకరమని తరతరాలుగా నమ్ముతున్నారు. పైపైన చూస్తే బెల్లమే మంచిదనిపిస్తుంది. కానీ, ఇది నిజంగా మీ రక్తంలో చక్కెర స్థాయిలకు మేలు చేస్తుందా? ఇన్సులిన్ రెసిస్టెన్స్, షుగర్ వ్యాధి ఉన్నవారు, లేదా సాధారణంగా తమ శరీరాన్ని ఆరోగ్యంగా ఉంచుకోవాలనుకునేవారు.. బెల్లం వాడకానికి ఎలాంటి మినహాయింపు లేదు. అన్ని రకాల తీపి పదార్థాల మాదిరిగానే, దీనిని కూడా నిర్దిష్ట మోతాదులోనే తీసుకోవాలి. ఎందుకంటే, చివరికి చక్కెర అనేది పొగాకు లాంటిదే. దీనిని తగ్గించడమే మంచిది.." అని పేర్కొన్నారు. "శుద్ధి చేసిన చక్కెర దాదాపు స్వచ్ఛమైన సుక్రోజ్ అయితే, బెల్లం తయారీలో తక్కువ ప్రాసెసింగ్ ఉంటుంది. అందుకే దీనిలో ఐరన్, పొటాషియం, మెగ్నీషియం, కొన్ని యాంటీఆక్సిడెంట్లు లాంటి ఖనిజాలు కొద్ది మొత్తంలో మిగిలి ఉంటాయి. ఈ కారణంగానే బెల్లం కేవలం తీపి కోసం కాకుండా, పోషకాలను అందించేదిగా ప్రచారం పొందింది" అని ఆయన తెలిపారు.

**బెల్లం కూడా చక్కెరే**

ఇక్కడే అసలు విషయం ఉంది. "బెల్లం రకాన్ని బట్టి, దాని అణు నిర్మాణాన్ని పరిశీలిస్తే, ఇది కూడా 65 నుంచి 90 శాతం వరకు చక్కెర (సుక్రోజ్) మాత్రమే. కేలరీల విషయంలో తెల్ల చక్కెరతో దాదాపు సమానం. మరి శరీరంలో జీర్ణమయ్యే విషయంలోనా? అక్కడే పెద్ద ఆశ్చర్యం ఉంది" అని కరణ్ అన్నారు.

ఆహారం తిన్న తర్వాత రక్తంలో చక్కెర స్థాయిలు ఎంత వేగంగా పెరుగుతాయో చెప్పే గ్లైసెమిక్ ఇండెక్స్ (జీఐ) వేరే కథ చెబుతుంది. "తెల్ల చక్కెర జీఐ సుమారు 65 అయితే, మనం ఎక్కువగా వాడే చెరకు బెల్లం జీఐ ఇంకా ఎక్కువ. తరచుగా 84 లేదా అంతకంటే ఎక్కువ. సింపుల్‌గా చెప్పాలంటే, మీరు తెల్ల చక్కెరకి బదులు వాడే బెల్లం, రక్తంలో చక్కెరను మరింత వేగంగా పెంచుతుంది" అని వివరించారు. "నేను స్వయంగా దీనిని నిరంతర గ్లూకోజ్ పర్యవేక్షణ ద్వారా పరీక్షించాను. మామూలు చక్కెరతో చేసిన టీకి, బెల్లంతో చేసిన టీకి నా రక్తంలో చక్కెర స్పందనను పోల్చి చూసినప్పుడు, రెండింటిలోనూ దాదాపు ఒకే విధంగా, వేగంగా, చెప్పుకోదగ్గ స్థాయిలో చక్కెర పెరిగింది. బెల్లం వల్ల గ్లూకోజ్ నెమ్మదిగా పెరుగుతుందనే ఆలోచన నిజం కాదని తేలింది" అని ఆయన వివరించారు.


ఇది కేవలం తన వ్యక్తిగత అనుభవం మాత్రమే కాదని కరణ్ స్పష్టం చేశారు. "2022లో ప్రచురించిన ఒక అధ్యయనం (జర్నల్ ఆఫ్ ఫ్యూచర్ ఫుడ్స్‌లో) టైప్ 2 షుగర్ ఉన్న రోగులలో కొబ్బరి బెల్లం, చెరకు చక్కెరను పోల్చి చూసింది. భోజనం తర్వాత రక్తంలో చక్కెర స్థాయిలలో ఈ రెండు తీపి పదార్థాల మధ్య ఎలాంటి పెద్ద తేడాను గుర్తించలేదు. ఆరోగ్యకరమైనవిగా భావించే బెల్లం రకాలు కూడా గ్లూకోజ్‌ని నియంత్రించడంలో పెద్దగా ప్రయోజనం చూపలేదు" అని ఆయన అన్నారు.

**బెస్ట్ ఆల్టర్నేటివ్స్ ఇవే..**

అన్ని బెల్లం రకాలు ఒకేలా ఉండవని కరణ్ తెలిపారు. "పామిరా పామ్ బెల్లం వంటి కొన్ని రకాల పామ్ బెల్లానికి తక్కువ జీఐ (సుమారు 35) ఉందని పరిశోధనల్లో తేలింది. కానీ ఈ రకం చాలా తక్కువగా లభిస్తుంది. భారతదేశంలో వాణిజ్యపరంగా లభించే బెల్లంలో ఎక్కువ భాగం ఇంకా చెరకు ఆధారితమే. అది ఎక్కువ జీఐ ఉన్న రకం. చాలా మందికి తెలియకుండానే దీన్ని వాడేస్తున్నారు..' అని వివరించారు.

'సురక్షితమైన ప్రత్యామ్నాయాలను కోరుకునేవారు మోంక్ ఫ్రూట్, స్టీవియా , అల్లులోస్ వంటి కొన్ని సహజమైన, సున్నా కేలరీల తీపి పదార్థాలను ఉపయోగించవచ్చు. ఇవి రక్తంలో చక్కెరను గణనీయంగా పెంచకుండా తీపిని అందిస్తాయి" అని ఆయన సూచించారు.


"బెల్లం సహజమైనదిగా అనిపించవచ్చు. కానీ మీ శరీరం తీపి పదార్థాలను అవి ఎంత సంప్రదాయబద్ధంగా ఉన్నాయనే దాని ఆధారంగా గుర్తించదు. ఒకసారి శరీరంలోకి వెళ్ళాక అది గ్లూకోజ్, ఫ్రక్టోజ్‌లను మాత్రమే చూస్తుంది.





# ఇలా మసాజ్ చేస్తే జుట్టు సమస్యలు పారా హుషార్ అవ్వాల్సిందే..

పెరిగిన ఒత్తిడి, సరిలేని లైఫ్‌స్టైల్, ఇతర సమస్యల కారణంగా జుట్టు రాలుతుంటుంది. పెరగదు. దీని కారణంగా, జుట్టు పల్చబడడం, బట్టతల రావడం, ఇతర సమస్యలొస్తాయి. అయితే, అలా కాకుండా రక్తప్రసరణ పెరిగి కొత్త జుట్టు రావాలంటే ఆయుర్వేదంలో కొన్ని కిటుకులు హెల్ప్ చేస్తాయి. వీటిని ఫాలో అయితే జుట్టు సమస్యలు ఎన్నీ ఉన్నా తగ్గిపోవడమే కాకుండా ఎలాంటి సైడ్ ఎఫెక్ట్స్ లేకుండా జుట్టు ఒత్తుగా పెరుగుతుంది. రోజుకి 5 నిమిషాల పాటు స్కాల్ప్ మసాజ్ చేస్తే చాలు మంచి రిజల్ట్స్ ఉంటాయని అను త్రిపాఠి చెబుతున్నారు. ఆయుర్వేదం ప్రకారం మీ తలపై నాడీ వ్యవస్థని అనుసంధానించే ముఖ్య మర్మ బిందువులు ఉంటాయి. వాటిని ప్రేరేపించడం వల్ల రక్తప్రసరణ పెరుగుతుంది. ఒత్తిడి తగ్గి జుట్టు పెరుగుతుంది. స్కాల్ప్‌ని మసాజ్ చేస్తే జుట్టు కుదుళ్లకి రక్తప్రవాహం పెరుగుతుంది. రోజులు పెరిగేకొద్దీ జుట్టు స్ట్రాంగ్‌గా మారుతుంది. ముందుగా చేతులని వేడి చేయాలి. అరచేతులతో మెల్లిగా మసాజ్ చేయండి. జుట్టుకి లోపల నుంచి ప్రెజర్ పెరిగేందుకు తలపై మసాజర్‌ని వాడండి. ప్రతిరోజూ 5 నిమిషాల పాటు ఇలా చేయండి. 2, 3 వారాల్లో తేడాని గమనిస్తారు.తర్వాత చెక్క దువ్వెనతో లేదా మసాజర్‌తో మరోసారి మసాజ్ చేయండి. దీని వల్ల తలకి రక్తప్రసరణ అందుతుంది. నేరుగా మసాజ్ చేసే బదులు ఏదైనా ఆయిల్ రాసి కొద్దిగా అప్లై చేసి మెల్లిగా మసాజ్ చేయండి. దీంతో స్కాల్ప్‌పై రక్తప్రసరణ పెరుగుతుంది. జుట్టు సమస్యలు దూరమవుతాయి. ఏదైనా ఓ ఆయిల్‌ని కొద్దిగా వేడి చేసి అందులో ఏదైనా ఓ ఎసెన్షియల్ ఆయిల్ కలిపి దాంతో మెల్లిగా మసాజ్ చేయండి. దీంతో జుట్టు సమస్యలు చాలా వరకూ తగ్గుతాయి. అదే విధంగా, కెమికల్స్ ఉండే షాంపూ బదులు హెర్బల్, సల్ఫేట్ ఫ్రీ షాంపూ వాడండి. ఎక్కువగా హెయిర్ డ్రైయర్స్, స్టైలింగ్ ప్రోడక్ట్స్, హెయిర్ కలర్స్ వాడకుండా నేచురల్ రెమిడీస్ వాడండి. దీని వల్ల చాలా వరకూ సమస్య తగ్గుతుంది. జుట్టు రాలడం తగ్గి ఒత్తుగా పెరుగుతుంది.



# నాలుక రంగు మారుతుందా.. తస్మాత్ జాగ్రత్త..!



శరీరంలో జరిగే ప్రతి చిన్న మార్పు కూడా ఏదో ఒక రూపాన మనకు కనిపిస్తుంది. కొన్ని కొన్ని సందర్భాల్లో మనలోపల ఉన్న ఆరోగ్య సమస్యలను కూడా ఈ మార్పులను సూచిస్తాయి. అలాంటి వాటిలో అధికంగా కళ్లు, నాలుక ప్రధాన సాధనాలుగా పనిచేస్తాయి. చాలా మందికి నాలుక రంగు మారుతుంటుంది. దీనిని వాళ్లు చాలా లైట్‌గా తీసుకుంటారు. ఏదో రాత్రి తిన్న ఆహారం వల్లో, మరోదో కారణం అనుకుంటారు. కానీ నాలుక రంగు మారడం అనేది చాలా ఆరోగ్య సమస్యలకు సంకేతం కావొచ్చని ఆరోగ్య నిపుణులు చెప్తున్నారు. ఏ అనారోగ్యం వచ్చే ముందైనా కొన్ని సింప్టమ్స్ కనిపిస్తాయి. వాటిని బట్టి ఎలాంటి ఇబ్బంది ఉందని గుర్తించవచ్చు. అయితే..ఈ లక్షణాలు అనీ బయటకు కనిపించాలని లేదు. కొన్నిసార్లు ఇవి తెలియకుండానే ఇబ్బంది పెట్టేస్తాయి. కళ్లను బట్టి ఎలాంటి జబ్బు ఉందో తెలుసుకోవచ్చు అంటారు వైద్యులు. అందుకే..చెకప్ కి వెళ్లినప్పుడు కళ్లను పరీక్షిస్తారు. కేవలం కళ్లే కాదు. నాలుక కూడా అనారోగ్యాలకు సంబంధించిన సంకేతాలను ఇస్తుందని చెబుతున్నారు వెల్‌నెస్ ఎక్స్ పర్ట్ మనీషా. ఏ మాత్రం పట్టించుకోకుండా వదిలేసే ఈ లక్షణాలను సరైన విధంగా గుర్తిస్తే చాలా వరకూ సమస్యల్ని తగ్గించుకోవచ్చని వివరించారు. ఆయుర్వేదం ప్రకారం నాలుక రంగుని బట్టి ఈ రోగాలను గుర్తించేందుకు వీలుంటుందని అన్నారు. మరి ఏ రంగుని బట్టి ఏ వ్యాధిని గుర్తించవచ్చు. అలాంటి లక్షణాలు కనిపించినప్పుడు ఏం చేయాలి అనేది తెలుసుకుందాం.

మీ నాలుక రంగుని ఎప్పుడైనా గమనించారా. ఇదేం ప్రశ్న అనుకోకండి. కలర్ ని బట్టి మీకు ఎలాంటి ఇబ్బందులు ఉన్నాయన్నది తెలుసుకోవచ్చు. కొన్ని అనారోగ్య సమస్యల్ని కేవలం ఈ రంగు ద్వారా గుర్తించవచ్చు. ఇదే విషయాన్ని చెబుతున్నారు వెల్ నెస్ ఎక్స్ పర్ట్ మనీషా. నిజానికి నాలుక రంగు ఎలా ఉందన్నది ఎవరూ ఎప్పుడూ పెద్దగా గమనించారు. బ్రష్ చేసుకున్నప్పుడు సింపుల్‌గా క్లీన్ చేసుకుని అక్కడితో వదిలేస్తారు. కానీ..రంగు ఎలా ఉంది. నాలుకపై ఏమైనా మార్పులు వస్తున్నాయా అన్నది గమనించరు. ఇలా నిర్లక్ష్యం చేయడం వల్లే చిన్న సమస్యలు కాస్తా పెద్దవైపోతున్నాయి. తరవాత ఎన్నో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది. అలా కాకుండా ముందుగానే గుర్తించి జాగ్రత్తలు తీసుకుంటే ఎలాంటి సమస్యలూ రావు. మరి నాలుక రంగుని బట్టి వ్యాధిని ఎలా గుర్తించాలి. వెల్ నెస్ ఎక్స్ పర్ట్ ఏం చెప్పారు.

నాలుకపై రంగు ఆకుపచ్చ లేదా ఎరుపు రంగులకి మారిందంటే అది కూడా కొన్ని అనారోగ్యాలకు సంకేతమే. ఈ కలర్ ఉందంటే పిత్త దోషం ఉందని అర్థం చేసుకోవాలి. బాడీలో ఉండాల్సిన దాని కన్నా ఎక్కువ పిత్తగుణం ఉంటే ఇలా జరుగుతుంది. ముఖ్యంగా జీర్ణ వ్యవస్థతో ముడిపడి ఉంటుంది. ఏం తిన్నా సరే విపరీతమైన అసిడిటీ వచ్చేస్తుంది. రిఫ్లక్స్ తో ఇబ్బంది పడతారు. శరీరంలో క్రమంగా ఇన్‌ఫ్లమేషన్ పెరిగిపోయి టాక్సిన్స్ పేరుకుపోతాయి. అంతే కాదు. మూడ్ స్వింగ్స్ కూడా ఎక్కువగా ఉంటాయి. ప్రతి దానికీ చిరాకు, కోపం వచ్చేస్తుంటుంది. పని తప్ప మరో ధ్యాస ఉండదు. ఎవరు కాస్త వర్క్ డిస్టర్బ్ చేసినా వెంటనే గట్టిగా అరిచేస్తారు. పసుపు రంగు ఉన్నా ఇదే సమస్య ఉన్నట్టు గమనించాలి.

నాలుకపై తెలుపు రంగు ఎక్కువైపోతూ ఉంటే వెంటనే జాగ్రత్తపడడం మంచిది. ఆయుర్వేదం ప్రకారం చెప్పాలంటే నాలుక ఇలా వైట్ కలర్ లోకి మారిపోయిందంటే కఫదోషం పెరిగిపోయిందని అర్థం. ఇలా కఫం పెరిగినప్పుడు శరీరంలో చాలా మార్పులు వస్తాయి. ముఖ్యంగా విపరీతమైన బద్ధకం వచ్చేస్తుంది. ఏ పనీ చేయాలని అనిపించదు. ఒకవేళ చేసినా ఫోకస్ ఉండదు. ఎప్పుడూ నిద్రమబ్బుగా ఉంటారు. అన్ని పనులనూ వాయిదా వేయాలనిపిస్తుంది. సింపుల్‌గా చెప్పాలంటే ఇది పూర్తిగా మానసిక ఆరోగ్యాన్నీ దెబ్బ తీస్తుంది. ఇలాంటి లక్షణాలు కనిపించాయంటే కఫ దోషాన్ని పోగొట్టుకోడానికి ప్రయత్నించాలి. ఇందుకు సంబంధించిన ఆయుర్వేద చిట్కాలు పాటించాలి.

నాలుక గులాబీ రంగులో ఉంటే మాత్రం మీరు చాలా ఆరోగ్యంగా ఉన్నట్టు లెక్క. ఆయుర్వేదం ప్రకారం..నాలుక అంటే కేవలం మాట్లాడడానికి, రుచి చూడడానికి మాత్రమే ఉపయోగపడే అవయవం కాదు. ఆరోగ్యానికి ఇదే ఇండెక్స్ లాంటిది. అందుకే..నాలుకను శుభ్రంగా ఉంచుకోవాలి. రంగు మారినప్పుడు జాగ్రత్తపడాలి. కఫం, వాతం పెంచే ఆహార పదార్థాలను పూర్తిగా పక్కన పెట్టాలి. శరీరంలో ఇన్‌ఫ్లమేషన్ తగ్గించే ఫుడ్ తీసుకోవడం మంచిది. వీలైనంత వరకూ ఆయిల్ ఫుడ్ తగ్గించాలి.

నాలుక రంగు పూర్తిగా నలుపు లేదా గోధుమ రంగులోకి మారిపోయిందంటే వాతదోషం ఉందని అర్థం. విపరీతంగా ఒత్తిడి ఉన్నప్పుడు ఇలా జరుగుతుంది. స్ట్రెస్ కి లోనైనప్పుడు సరైన నిద్ర ఉండదు. ఎప్పుడూ చాలా అలసటగా అనిపిస్తుంది. ప్రతి చిన్న విషయాన్ని ఎక్కువగా ఆలోచిస్తుంటారు. ఆలోచనలకు కంట్రోల్ ఉండదు. అతిగా ఆలోచించడం, విశ్రాంతి లేకపోవడం..ఈ కారణాల వల్ల నాలుకపై రంగు మారిపోతుంది. వాతదోషం వస్తే చర్మంతో పాటు జుట్టు కూడా పొడిబారిపోతుంది. అంతే కాదు. ఆహారం సరిగ్గా జీర్ణం కాదు. ఇది క్రమంగా మలబద్ధకానికి దారి తీస్తుంది. అక్కడితోనే సమస్యలన్నీ మొదలవుతాయి.



# ఓ వైపు వాయిదా, మరోవైపు పోరాటం..

- భారీ ప్రాజెక్ట్‌స్‌తో బిజీగా ప్రభాస్
- రాజాసాబ్ షూటింగ్ పూర్తి చేసే పనిలో డార్లింగ్
- సంక్రాంతికి రాజాసాబ్ రానుందనే టాక్
- మరి డైరెక్టర్ మారుతి ఏం చేస్తారో

పాన్ ఇండియా స్టార్ 'ప్రభాస్' భారీ ప్రాజెక్ట్‌స్‌తో బిజీగా ఉన్న సంగతి తెలిసిందే. ప్రస్తుతానికి 'రాజాసాబ్' షూటింగ్ పూర్తి చేసే పనిలో బిజీగా ఉన్నారు. వాస్తవానికైతే ఎప్పుడో ఈ సినిమా షూటింగ్ కంప్లీట్ కావాల్సి ఉంది. కానీ ప్రభాస్ మోకాలి నొప్పితో పాటు ఫౌజీ షూటింగ్ కారణంగా బ్రేక్ పడుతూ వచ్చింది. కొన్ని రోజులు మధ్యలో రెస్ట్ తీసుకున్న డార్లింగ్.. ఇప్పుడు తిరిగి షూటింగ్‌లో జాయిన్ అయ్యారు. రాజాసాబ్ షూటింగ్‌కు ఫినిషింగ్ టచ్ ఇచ్చే పనిలో ఉన్నారు. ప్రస్తుతం రాజాసాబ్‌లోని యాక్షన్ సీక్వెన్స్‌కు సంబంధించిన షూటింగ్ జరుగుతున్నట్టు తెలుస్తోంది. ఈ యాక్షన్ సీక్వెన్స్ షూటింగ్ అయిపోయిన వెంటనే.. సాంగ్స్ షూట్ చేయనున్నారట. ఇక్కడితో సినిమా షూటింగ్ మొత్తంగ కంప్లీట్ కానుంది.

ఎట్టిపరిస్థితుల్లోను రాజాసాబ్ సినిమాను డిసెంబర్ 5న రిలీజ్ చేసి తీరుతామని మేకర్స్ చెబుతున్నారు. కానీ మరోవైపు ఈ సినిమా వాయిదా పడుతుందనే వార్తలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. హిందీలో రెండు సినిమాలు రిలీజ్‌కు రెడీ అవుతున్నాయి. దీంతో రాజాసాబ్ వాయిదా పడుతుండడంతోనే.. ఆ సినిమాలు రిలీజ్ అవుతున్నాయనే ప్రచారం జరుగుతోంది. డిసెంబర్ నుంచి పోస్ట్‌పోన్ అయి.. సంక్రాంతికి రాజాసాబ్ రానుందనే టాక్ నడుస్తోంది. కానీ ఇప్పటికే సంక్రాంతికి 'మెగా 157' రిలీజ్‌కు రెడీగా ఉంది. అలాగే రవితేజ సినిమాతో పాటు జన నయగన్ కూడా రిలీజ్‌కు రెడీ అవుతోంది. మరిన్ని సినిమాలు కూడా వచ్చే అవకాశాలు ఉన్నాయి. సంక్రాంతికి రేసు రసవత్తరంగానే ఉంది. కాబట్టి రాజాసాబ్ డిసెంబర్ 5కే వచ్చే అవకాశాలు ఎక్కువ. షూటింగ్ కూడా చివరి దశకు చేరుకుంది. మరి డైరెక్టర్ మారుతి ఏం చేస్తారో చూడాలి.

రెబల్ స్టార్ ప్రభాస్, డైరెక్టర్ మారుతి కాంబోలో తెరకెక్కుతున్న చిత్రం 'రాజాసాబ్'. హారర్ కామెడీ థ్రిల్లర్ జోనర్‌లో ఈ సినిమా తెరకెక్కుతోంది. ఇందులో డార్లింగ్ సరసన హాట్ భామలు నిధి అగర్వాల్, మాళవిక మోహనన్, రిద్ది కుమార్ కథానాయికలుగా నటిస్తున్నారు. సంజయ్ దత్ కీలక పాత్రలో నటిస్తున్నారు. ఈ చిత్రంను పీపుల్ మీడియా ఫ్యాక్టరీపై టీజీ విశ్వప్రసాద్, వివేక్ కూచిబొట్ల సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఎస్ ఎస్ తమన్ సంగీతం అందిస్తున్నారు. రాజాసాబ్ నుంచి వచ్చిన పోస్టర్స్, గ్లింప్స్, సాంగ్స్, టీజర్‌కు మంచి రెస్పాన్స్ వచ్చింది.




# ఏం జరిగినా.. నేను అతన్నే పెళ్లి చేసుకుంటా!

వయసు పెరిగే కొద్దీ.. పెళ్లి చేసుకోవడం, పిల్లలను కనడం మహిళలకు పరిపాటి. కానీ కొంతమంది సెలబ్రిటీలు వివాహ వయస్సు దాటినా.. ఇప్పటికీ ఒంటరిగానే ఉన్నారు. ఈ నేపథ్యంలో సెలబ్రిటీల పెళ్లి గురించి వార్తలు ఎప్పుడూ సోషల్ మీడియాలో వైరల్ అవుతూనే ఉంటాయి. ఈ జాబితాలో టాలీవుడ్ ముద్దుగుమ్మ 'అనుష్క శెట్టి' అగ్రస్థానంలో ఉంటారు. అనుష్క ఇటీవల ఓ ఇంటర్వ్యూలో తన వివాహం గురించి మాట్లాడారు. స్వీటీ చెప్పిన ముచ్చట్లు చిత్ర పరిశ్రమలో ఇప్పుడు చర్చనీయాంశంగా మారాయి.

అనుష్క శెట్టి దాదాపు 20 సంవత్సరాలుగా ఇండస్ట్రీలో ఉంటున్నారు. 2005లో కింగ్ నాగార్జున హీరోగా వచ్చిన 'సూపర్' సినిమాతో అనుష్క వెండి తెరకు పరిచయం అయ్యారు. స్వీటీ తర్వాత ఇండస్ట్రీలోకి వచ్చిన చాలా మంది హీరోయిన్లు పెళ్లి చేసుకుని స్థిరపడ్డారు. కొందరు యువ హీరోయిన్స్ కూడా సెటిల్ అయ్యారు. 40 ఏళ్లు దాటినా కూడా అనుష్క ఇంకా ఒంటరి జీవితాన్ని గడుపుతున్నారు. ఈ నేపథ్యంలో అనుష్క వివాహం గురించి అనేక రూమర్స్ వచ్చాయి. స్టార్ హీరో ప్రభాస్‌తో స్వీటీ ప్రేమలో ఉన్నారని, త్వరలో పెళ్లి చేసుకోబోతున్నారని పుకార్లు వచ్చాయి. కానీ అవన్నీ కేవలం రూమర్స్ అని ఇద్దరు కొట్టిపారేశారు. ఓ బడా వ్యాపారవేత్తతో అనుష్క వివాహం అంటూ వార్తలు వచ్చాయి. అవి కూడా నిజం కాదని తేలింది.

అనుష్క ఇటీవల ఒక ఇంటర్వ్యూలో తన వివాహం గురించి మాట్లాడారు. 'బాహుబలి సినిమా తర్వాత నాపై పెళ్లి ఒత్తిడి బాగా పెరిగింది. నా కుటుంబ సభ్యులు కూడా పెళ్లి చేసుకోమని అంటున్నారు. మీడియా మాత్రమే కాదు.. ప్రతిచోటా ఇదే ప్రశ్న నన్ను అడుగుతున్నారు. నాకు వివాహ బంధంపై నమ్మకం ఉంది. సరైన సమయం వచ్చినప్పుడు తప్పకుండా పెళ్లి చేసుకుంటా. నాకు పిల్లలంటే చాలా ఇష్టం. కానీ ప్రేమ లేకుండా ఎవరినీ పెళ్లి చేసుకోను. ఎవరేమనుకున్నా సరే, ఏం జరిగినా సరే.. నాకు నచ్చిన వ్యక్తినే నేను పెళ్లి చేసుకుంటా. నా తల్లిదండ్రులు కూడా ఇదే చెప్పాను. సరైన వ్యక్తి కోసం, సరైన సమయం కోసం నేను ఎదురు చూస్తున్నా. సినిమా ఇండస్ట్రీ చెందిన ఎవరినీ పెళ్లి చేసుకోను' అని అనుష్క చెప్పారు. ప్రస్తుతం ఈ వ్యాఖ్యలు నెట్టింట వైరల్ అయ్యాయి.

సౌత్ ఇండస్ట్రీలో భారీ క్రేజ్ సంపాదించుకున్న అనుష్క శెట్టి.. నాగార్జున, ప్రభాస్, రవితేజ, వెంకటేష్, మహేష్ బాబు వంటి స్టార్ హీరోలతో అనేక సూపర్ హిట్ చిత్రాల్లో నటించారు. తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపును తెచ్చుకున్న స్వీటీ.. కొంతకాలంగా సినిమాలకు దూరంగా ఉంటున్నారు. అనుష్క తాజా చిత్రం 'ఘాటి' విడుదలకు సిద్ధంగా ఉంది. అయితే విడుదల తేదీపై ఇంకా స్పష్టత లేదు. ఈ చిత్రం ఇప్పటికే రెండుసార్లు వాయిదా పడింది. ప్రస్తుతం అనుష్క బెంగళూరులో ఉంటున్నారు.



# స్టార్ హీరోయిన్ కు హైకోర్టులో ఎదురుదెబ్బ..

హిమాచల్ ప్రదేశ్ రాష్ట్రం నుంచి భాజపా ఎంపీగా ఉన్న ప్రముఖ బాలీవుడ్ నటి కంగనా రనౌత్‌కు పంజాబ్-హర్యానా హైకోర్టులో ఓ కేసులో ఎదురుదెబ్బ తగిలింది. ఆమెపై ఉన్న డిఫమేషన్ కేసును రద్దు చేయాలంటూ ఆమె వేసిన పిటిషన్‌ను కోర్టు తిరస్కరించింది. ఈ కేసు 2021లో జరిగిన సంఘటనలకు సంబంధించింది. ఆ సమయంలో దేశవ్యాప్తంగా కిసాన్ ఆందోళన జరుగుతుంది. అదే సమయంలో కంగనా రనౌత్ ఒక ట్వీట్ చేసింది. ఆ ట్వీట్‌లో బతిండా జిల్లా బహదూర్‌గఢ్ జండియా గ్రామానికి చెందిన మహిందర్ కౌర్ అనే 87 ఏళ్ల వృద్ధ మహిళను 200 రూపాయలు తీసుకుని ఆందోళనకు వచ్చిన మహిళగా అభివర్ణించారు.

ఈ ట్వీట్ సదరు మహిళ గౌరవాన్ని దెబ్బతీసిందంటూ.. 2021 జనవరి 4న మహిందర్ కౌర్ బతిండా కోర్టులో డిఫమేషన్ కేసు దాఖలు చేశారు. కంగనా తర్వాత ఆ ట్వీట్‌ను తొలగించినప్పటికీ, ఇప్పటికే కేసు నమోదు అయ్యింది. ఈ కేసుపై 13 నెలల పాటు విచారణ జరిగిన అనంతరం బతిండా కోర్టు కంగనాకు సమన్లు జారీ చేసింది. దీంతో ఈ కేసును రద్దు చేయించుకోవాలనే ఉద్దేశంతో కంగనా పంజాబ్-హర్యానా హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు.

అయితే, జస్టిస్ త్రిభువన్ సింగ్ దహియా నేతృత్వంలోని కోర్టు ఆమె పిటిషన్‌ను తిరస్కరించింది. కంగనా రనౌత్ ఒక సెలబ్రిటీ.. ఆమె చేసిన ట్వీట్ లేదా రీట్వీట్ వలన బాధిత మహిళ ప్రతిష్టకు హాని జరిగిందని, అది పూర్తిగా మనభిమానానికి దారితీసేలా ఉందని కోర్టు పేర్కొంది. మ్యాజిస్ట్రేట్ అన్ని ఆధారాలను పరిశీలించిన తరువాతే కంగనాపై ప్రాథమికంగా IPC సెక్షన్ 499 ప్రకారం కేసు కొనసాగించేలా నిర్ణయించారని పేర్కొంది. దీంతో, ఇకపై కంగనాకు పంజాబ్‌లోని స్థానిక కోర్టులో విచారణకు హాజరవ్వాల్సి ఉంటుంది.

అయితే , కంగనా తన తరఫు వాదనలో తాను స్వయంగా ఆ ట్వీట్ రాయలేదని.. ఒక న్యాయవాది పోస్టును కేవలం రీట్వీట్ చేశానని చెబుతున్నారు. అయినప్పటికీ, కోర్టు ఈ వాదనను తోసిపుచ్చింది. దీనితో మరోసారి ఈ కేసు సంబంధించి ఆమెపై విచారణ కొనసాగనుంది.



EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY PURAM MAHESHWAR PRINTED AT HARI HARA ART PRINTERS, H.NO. 6-185, TOOPRAN, DIST. MEDAK, TELANGANA-502336. AND PUBLISHED AT H.NO. 4-50/18, KALLAKAL, VILL-KALLAKAL,(PO), KALLAKAL, (M) MANOHARABAD, DIST, MEDAK, TELANGANA-502336,
EDITOR: PURAM MAHESHWAR. RNI NO : TELTEL/2006/17154, CELL : 8008609999